ఆలయాల్లో వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

» జిల్లా దేవదాయ శాఖాధికారిణి అన్నపూర్ణ

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా దేవదాయ శాఖ అధికారిణి అన్నపూర్ణ తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ, తిరుపతిలో తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ టెలి కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారన్నారు. అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్‌పై నియమించుకొని, పోలీసుల సహకారం తీసుకుంటున్నామన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి, తిరిగిరాని లోకాలకు..

తిరుపతి తొక్కిసలాటలో నగరానికి చెందిన ముగ్గురు మహిళలు మృతి



లావణ్య భర్తను పరామర్శిస్తున్న బంధువులు

» కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

» నేడు స్వస్థలాలకు చేరనున్న మృతదేహాలు

» ఒక్కో కుటుంబానిదీ ఒక్కో గాథ



తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన లావణ్య, కండిపిల్లి శాంతి, గుడ్ల రజిని (ఫైల్ ఫొటోలు)

మద్దిలపాలెం/అక్కయ్యపాలెం/కంచరపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): **వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారంలో తిరుమలేశుని దర్శించుకోవాలనుకున్న నగరానికి చెందిన ముగ్గురు మహిళలు బుధవారం రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందారు. విశాఖపట్నం రైల్వే న్యూకాలనీలోని వెంకటేశ్వర కాలనీ ప్రాంతానికి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి (38), కంచరపాలెం గాంధీనగర్ వాసి కండిపిల్లి శాంతి (35), మద్దిలపాలెం రామాలయం వీధికి చెందిన గుడ్ల రజని (47) మృతిచెందినట్టు గురువారం ఉదయం వారి బంధువులకు సమాచారం వచ్చింది.**

రైల్వే న్యూకాలనీ ప్రాంతంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన లావణ్య స్వాతి, సతీష్‌లకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఆమె మరో నలుగురితో కలిసి రెండు రోజుల క్రితం తిరుపతి వెళ్లారు. స్వామివారిని దర్శనం చేసుకుని పండుగకు తిరిగివస్తామని చెప్పారని, ఇంతలో ఇలా తిరిగిరాని లోకాలకు తరలిపోయారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. లావణ్య, సతీష్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్కయ్యపాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పెద్ద కుమార్తె లాస్య తొమ్మిదో తరగతి, చిన్న కుమార్తె కీర్తిశ్రీ ఐదో తరగతి చదువుతున్నారు. సతీష్ సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. లావణ్య ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి సరదాగా ఉండేవారని, అందరూ తన తోబుట్టువులుగా భావించి ఆప్యాయంగా పలకరించేవారని స్థానికులు, కుటుంబ సభ్యులు గుర్తుచేసుకుని బాధపడుతున్నారు.

తెగిపోయిన ప్రేమ బంధం

శాంతి, వెంకటేష్ ఇరవై ఏళ్ల కిందట ప్రేమ వివాహంతో ఒక్కటయ్యారు. కంచరపాలెం బ్రిడ్జి కింద గాంధీనగర్‌లో ఈ కుటుంబం నివసిస్తోంది. శాంతి భర్త వెంకటేష్ ఆటో నడుపుతుంటారు. వీరి కుమారుడు మహేందర్ కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. భర్త వెంకటేష్, కుమారుడు మహేందర్‌తో కలిసి శాంతి ఈ నెల ఏడో తేదీన తిరుపతి వెళ్లారు. వెంకటేష్, మహేందర్ క్యూలో వెనక్కి ఉండగా, కాస్త ముందున్న శాంతి తొక్కిసలాట జరగడంతో చనిపోయారు. ఏటా వైకుంఠ ఏకాదశి రోజున శాంతి తప్పకుండా తిరుపతి వెళ్లేదని అత్తమామలు అప్పలనరసమ్మ, అప్పారావు పేర్కొన్నారు. వారిది రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. శాంతి దినసరి కూలీ (భవన నిర్మాణ కార్మికురాలు)గా పని చేస్తూ భర్తకు చేదోడుగా ఉండేది. శాంతి తల్లి, అక్కచెల్లెళ్లు ఇందిరానగర్‌లోనే ఉంటున్నారు. శాంతి ... మిగతా 4వ పేజీలో



సింహగిరిపై స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి పూర్తయిన ఏర్పాట్లు

ముక్కోటి ఏకాదశికి సింహగిరి ముస్తాబు

నేటి ఉదయం 5 నుంచి 10.30 వరకూ ఉత్తర ద్వారంలో అప్పన్న దర్శనం

» ఏర్పాట్లు పూర్తి: ఈఓ

» అర్జిత సేవలన్నీ రద్దు



విద్యుద్దీపాలంకరణలో సింహాచలం దేవస్థానం

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి శుక్రవారం ఉత్తర ద్వారంలో వైకుంఠవాసునిగా దర్శనం ఇవ్వనున్నారు. సింహగిరిపై ఉత్సవ ఏర్పాట్లను గురువారం దేవస్థానం, ఇంజనీరింగ్, పోలీస్ అధికారులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్వామి దర్శనానికి వచ్చే భక్తులు సంయమనంతో ఉండాలని, అప్పుడే ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకునేందుకు వీలుకలుగుతుందన్నారు. శుక్రవారం అంతరాలయ దర్శనం, రాజగోపుర ప్రవేశాలను పూర్తిగా నిషేధించామని దేవస్థానం ఈవో చెప్పారు. ప్రతి ఒక్కరూ టికెట్ తీసుకోవాల్సిందేనని, ఉచిత పాస్‌లు జారీ చేయలేదన్నారు.

వైదిక కార్యక్రమాల వివరాలు...

- శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంటకు సుప్రభాత సేవ. అనంతరం ప్రభాత ఆరాధనలు. 3 గంటలకు అయ్యవారి సేవ, మేలి ముసుగులతో బేడా తిరువీధి
- 4.15 గంటలకు ఆలయ ఉత్తర ద్వారంలో ప్రత్యేక పూజల అనంతరం అనువంశిక ధర్మకర్త, వారి కుటుంబ సభ్యులకు తొలిదర్శనం
- 4.30 నుంచి 5 గంటల వరకూ ఉత్తర రాజగోపురంలో స్వామికి విశేష అలంకరణ. 5 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు ఉత్తర రాజగోపురంలో ముందుగా ఏర్పాటుచేసిన పుష్పవేదిక పైనుంచి భక్తులకు వైకుంఠవాసుడి అలంకారంలో శేషపాన్పుపై స్వామివారి దర్శనం.
- 12 గంటల నుంచి సింహగిరి మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం
- మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మహా నివేదన. ఆ సమయంలో భక్తులకు ఆలయంలో ... మిగతా 4వ పేజీలో

వైసీపీలో అయోమయం

సమన్వయకర్త లేని భీమిలి

» గుడివాడ అమర్‌ను బాధ్యత తీసుకోవాలని కోరిన అధిష్ఠానం

» నిరాకరించిన మాజీ మంత్రి

» తనకు పెందుర్తి లేదా అనకాపల్లి జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గం ఇవ్వాలని కోరినట్టు సమాచారం

» 'తూర్పు'లో పార్టీ కార్యక్రమాలకు దూరంగా సమన్వయకర్త ఎంవీవీ

» సమన్వయకర్త పదవి కోసం మేయర్ హరివెంకటకుమారి, మొల్లి అప్పారావు పోటీ

» వారిపట్ల అంతగా ఆసక్తి చూపని పార్టీ పెద్దలు

» ఎవరూ లేకపోతే వారిద్దరిలోనే ఒకరికి ఛాన్స్ ఇవ్వాలని యోచన

» గాజువాక సమన్వయకర్త పదవి కోసం మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, చింతలపూడి..



గుడివాడ అమర్‌నాథ్ | ఎంవీవీ సత్యనారాయణ | హరి వెంకట కుమారి | తిప్పల నాగిరెడ్డి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో వింత పరిస్థితి నెలకొంది. కొన్ని నియోజకవర్గాలకు సమన్వయకర్తలు లేకపోవడం, ఉన్నచోట కూడా ఒకరిద్దరు మినహా మిగిలినవారు అంటీముట్టనట్టు వ్యవహరిస్తుండడంతో క్యాడర్‌లో నిరాశా, నిస్పృహలు కనిపిస్తున్నాయి. సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టేందుకు ముఖ్యమైన నాయకులు విముఖత చూపుతుండడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో పార్టీ పెద్దలు కొట్టుమిట్టాడుతోంది.

సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రజలకు వైసీపీ నేతలు ముఖం చూపించడం మానేశారు. తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా కొనసాగుతున్నప్పటికీ రైతు సమస్యలు, విద్యుత్ చార్జీల పెంపుపై పార్టీ ఇటీవల నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు హాజరుకాలేదు. దీంతో ప్రస్తుతం ఆయన సమన్వయకర్త బాధ్యతల పట్ల ఆసక్తిగా లేరని నేతలు, కార్యకర్తలు నిర్ధారణకు వచ్చేశారు. ఎంవీవీ స్థానంలో ఎవరికైనా బాధ్యతలు అప్పగించాలని ద్వితీయశ్రేణి నేతలంతా కోరుతుండడంతో అధిష్ఠానం సమర్థులైన వారికోసం అన్వేషణ మొదలుపెట్టింది. సమన్వయకర్త బాధ్యతలు చేపట్టేందుకు ... మిగతా 4వ పేజీలో

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

సంక్రాంతి రద్దీని సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులు

» సాధారణ రోజుల్లో కంటే రెట్టింపు మొత్తం వసూలు

» హైదరాబాద్ టు విశాఖపట్నం చార్జీ సాధారణ రోజుల్లో రూ.1500-రూ.2,000

» అదే 10న రూ.3,200, 14న రూ.5,720

» 16, 17 తేదీల్లో విశాఖ-విజయవాడ ఏసీ స్లీపర్ రూ.1500-2,500

» పట్టించుకోని రవాణా శాఖ అధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండుగ రద్దీని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని టికెట్ ధరలను 50 నుంచి వంద శాతం పెంచేశారు. రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆపరేటర్ల దందాకు అంతూపొంతూ లేకుండా పోతోంది.

తెలుగు వారికి అత్యంత ప్రధానమైన పండుగల్లో సంక్రాంతి ఒకటి. విద్య, ఉద్యోగం, ఉపాధి అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా సంక్రాంతికి తమ స్వస్థలాలకు వస్తారు. పండుగ పూర్తయిన తర్వాత తిరిగి వెళతారు. దీంతో సంక్రాంతి ముందు, తరువాత రైళ్లు, బస్సులకు రద్దీ ఎక్కువగా ఉంటుంది. రైళ్లలో ప్రయాణానికి మూడు నెలల ముందే రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుంటుంది. అక్టోబరులో రిజర్వేషన్ స్లాట్ ఓపెన్ అయిన గంటల వ్యవధిలోనే టిక్కెట్లన్నీ బుక్ అయిపోతుంటాయి. రైళ్లలో టిక్కెట్లు దొరకనివారు, ప్రయాణం ఎప్పుడనే దానిపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోలేనివారంతా బస్సులపై ఆధారపడతారు. చాలామంది ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణానికి మొగ్గు చూపుతారు. దీంతో సంక్రాంతి సీజన్‌లో ప్రైవేటు ట్రావెల్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరాగా తీసుకుని నిర్వాహకులు టిక్కెట్ రేట్లు భారీగా పెంచేస్తున్నారు. ఈనెల ఏడో తేదీ వరకు ఉన్న టికెట్ చార్జీల కంటే 50 శాతం నుంచి వంద శాతం పెంచేశారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ నుంచి నగరానికి వచ్చేవారు ఎక్కువగా ఉండడంతో ఆయా మార్గాల్లో టిక్కెట్లను భారీగా పెంచేశారు. ఈనెల ఒకటిన హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రావాలంటే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో టికెట్ రూ.1500 నుంచి రూ.రెండు వేల మధ్య ఉండేది. అదే ఈ నెల పదిన టికెట్ రేట్లను పరిశీలిస్తే రూ.3,200, 14వ తేదీ నాటికి ఏకంగా రూ.5,720 వరకూ ఉంది. తిరుగు ప్రయాణాల విషయానికి వస్తే సాధారణ రోజుల్లో విశాఖ నుంచి హైదరాబాద్‌కు రూ.1,500 నుంచి రూ.రెండు వేల మధ్యన ఉండగా, సంక్రాంతి తరువాత వారం రోజుల వరకూ ప్రైవేటు ట్రావెల్స్‌లో టిక్కెట్ చార్జీలు భారీగా ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి రూ.ఆరు వేల వరకు వసూలుచేస్తున్నారు.

విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లేందుకు ఈనెల ఏడో తేదీ వరకు ఏసీ స్లీపర్ సీటు రూ.1,200, నాన్ ఏసీ స్లీపర్ రూ.900, ఏసీ చైర్ రూ.650 ఉండగా, 16, 17 తేదీల్లో ఏసీ స్లీపర్ రూ.1,500 నుంచి రూ.2,500 వరకూ పెంచేశారు.

హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ నుంచి ఈనెల ఏడు వరకు ఏసీ స్లీపర్ రూ.1500 నుంచి రూ.రెండు వేలు, నాన్ ఏసీ రూ.1060-1,500 ఉండగా, వీటి ధరలను 15,16 తేదీల్లో ... మిగతా 4వ పేజీలో

ఆర్టీసీ స్పెషల్స్

దూరప్రాంతాలకు 65, జోన్ పరిధిలో 85 బస్సులు

» నేడు, రేపు మరిన్ని సర్వీస్‌లు

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల కోసం ఆర్టీసీ విశాఖ రీజియన్ గురువారం 130 ప్రత్యేక బస్సులు నడిపింది. గురువారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ దూర ప్రాంతాలకు 65, జోన్ పరిధిలో 65 సర్వీస్‌లు నడిపినట్టు అధికారులు తెలి పారు. హైదరాబాద్‌కు పది షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ వాటికి మించి డిమాండ్ ఉండడంతో మరో 20 స్పెషల్స్ ఆపరేట్ చేశారు. అలాగే విజయవాడకు ప్రతి 40 నిమిషాలకు ఒక షెడ్యూల్ సర్వీస్ ఉన్నప్పటికీ డిమాండ్ రీత్యా అదనంగా 20, రాజమండ్రికి గంటకొక బస్సు ఉన్నప్పటికీ అదనంగా 15, కాకినాడకు మరో పది ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు.

విశాఖ నుంచి శ్రీకాకుళం జిల్లా పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, రాజాం, శ్రీకాకుళం ప్రాంతాలకు పది నిమిషాలకొక బస్సు ఉన్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ ఉండడంతో 35 ప్రత్యేక సర్వీస్‌లు నడి పారు. విజయనగరం, సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం తదితర ప్రాంతాలకు 30 ప్రత్యేక సర్వీసులు నడిపారు. శుక్ర, శనివారాల్లో సంక్రాంతి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు తగ్గట్టుగా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



విమ్స్‌లో సిద్ధం చేసిన పడకలను పరిశీలిస్తున్న డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

విమ్స్‌లో హెచ్ఎంపీవీ ప్రత్యేక వార్డు

ఆరిలోవ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పలు ప్రాంతాల్లో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు నమోదు కావడంతో విమ్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుజాగ్రత్తగా 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. ఈ వార్డును విమ్స్ డైరెక్టర్ రాంబాబు గురువారం పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. మందులు ... మిగతా 4వ పేజీలో

సెల్‌ఫోన్లు వినియోగించాం

సెంట్రల్ జైలు అధికారుల ఎదుట అంగీకరించిన ఇద్దరు ఖైదీలు

» ఎవరెవరితో మాట్లాడారో ఆరా తీస్తున్న అధికారులు

» ఇరువురిలో ఒకరు మాజీ ఎంపీ కుటుంబ సభ్యుల కేసులో ప్రధాన నిందితుడైన హేమంత్

ఆరిలోవ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్ర కారాగారంలో ఖైదీలు సెల్‌ఫోన్‌లు వినియోగిస్తున్న విషయం వాస్తవమేనని తేలింది. ఇక్కడ శిక్ష అనుభవిస్తున్న ఇద్దరు రౌడీషీటర్లు (వైసీపీకి చెందిన వారిగా చెబుతున్నారు) తాము జైలులో సెల్‌ఫోన్ వినియోగించినట్టు అధికారుల ఎదుట అంగీకరించారని డిప్యూటీ జైలు సూపరింటెండెంట్ జవహర్‌బాబు తెలిపారు. అయితే వారు ఎవరెవరితో మాట్లాడారో చెప్పలేదని, పోలీసు విచారణలో ఆ విషయం బయటపడుతుందన్నారు. మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబసభ్యుల కిడ్నాప్ కేసులో సూత్రధారుడైన రౌడీషీటర్ వెంకట హేమంత్‌కు వేరే కేసులో జీవితకాల శిక్ష పడడంతో గత ఏడాది జూన్ 16వ తేదీన ... మిగతా 4వ పేజీలో

విశాఖ-చర్లపల్లి మధ్య జన సాధారణ్ ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08533 నంబరు గల రైలు ఈ నెల 10, 12, 15, 17 తేదీల్లో ఉదయం 9.45 గంటలకు విశాఖలో బయలుదేరి అదేరోజు రాత్రి 11.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08534 నంబరుతో ఈ నెల 11, 13, 16, 18 తేదీల్లో 00.30 గంటలకు (10, 12, 15, 17 తేదీల అర్ధరాత్రి 12.30 గంటలకు) చర్లపల్లిలో బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు 11 అన్ రిజర్వుడ్ స్లీపర్ క్లాసు, తొమ్మిది జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సిట్టింగ్ కమ్ లగేజి కోచ్‌లతో రాకపోకలు సాగిస్తాయన్నారు. 08537 నంబరుతో మరో రైలు ఈ నెల 10, 11, 15, 16 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08538 నంబరుతో ఈనెల 11, 12, 16, 17 తేదీల్లో ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదే రోజు రాత్రి 10 గంటలకు విశాఖ చేరుతుందన్నారు.

11, 12 తేదీల్లో పలు రైళ్లు రద్దు

విజయవాడ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 11న కాకినాడ-విశాఖ పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ పాసింజర్ (17268), విశాఖ-పార్వతీపురం ప్రత్యేక రైలు (08565), పార్వతీపురం-విశాఖ ప్రత్యేక రైలు (08566), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 12న విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. కాగా భువనేశ్వర్-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (18447) ఈనెల 31 వరకు, తిరుగు ప్రయాణంలో ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 1 వరకు అదనపు స్లీపర్ క్లాసు కోచ్ జత చేయనున్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈనెల 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించామని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈనెల 19వ తేదీ ఆదివారం కావడంతో 20న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మైనారిటీ విద్యా సంస్థలకు ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు సెలవులు ఉంటాయన్నారు.


లక్ష్మీనరసింహస్వామి ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్న వేదిక


గాలిగోపురం వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

భీమునిపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలోని ప్రధాన మండపం, బేడ మండపాలను పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు.ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచెర్ల సింగరాచార్యులు పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనాలు ప్రారంభం కానున్నాయి. అలాగే బీచ్‌రోడ్ మంగమారిపేట వారిజ ఆశ్రమంలో ఉన్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ మందిరంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు రుత్విక్ శ్రీకాంత్ శర్మ తెలిపారు. తెల్లవారుజామున 4 నుంచి ఉత్తర ద్వార దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. అలాగే ఈనెల 11న కూడారై ఉత్సవం, 13న భోగి సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణం జరుగుతుందన్నారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలోను, ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా భక్తులకు ఉత్తర ద్వార దర్శనాలకు కల్పించనున్నట్టు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఎట్టకేలకు చెత్త తొలగింపు

పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శుభ్రపరిచారు. ఆలయం చెంత...అపరిశుభ్రత అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన కథనానికి జడ్సీ ప్రేమ ప్రసన్న వాణి స్పందించారు.ఈమేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు, శానిటరీ మేస్త్రి రేగాని రవి, సచివాలయం పర్యావరణ కార్యదర్శి రామశర్మ ఆధ్వర్యంలో 15 మంది సిబ్బందితో పనులు నిర్వహించారు. కొండపై ఆలయం వద్ద, బేడ మండపం, మెట్ల మార్గంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ట్యాంకర్‌తో నీటిని కొండపైకి పంపించడంతో ఆలయ పరిసరాలను, మెట్ల మార్గాన్ని నీటితో శుభ్రపరిచారు. మహిళలు మెట్లకు పసుపు, కుంకుమతో బొట్లు పెట్టి ముగ్గులు వేశారు. ఆలయం నలువైపులా రోడ్డుకి ఇరువైపులా సున్నంతో లైన్లు వేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బేడా మండపంలో స్వామివారి తిరువీధి

ముగిసిన పగల్‌పత్ ఉత్సవాలు

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో పది రోజులుగా జరుగుతున్న పగల్ పత్ ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది, బంగారు తొళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. బోయిలు పల్లకి మోయగా ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ బేడా మండప తిరువీధి వైభవంగా జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో పూజలు చేసి, నాలాయిర దివ్యప్రబంధ పారాయణం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లి, తిరిగిరాని లోకాలకు...

... 3వ పేజీ తరువాయి

కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తున్న బంధువులు, స్థానికులతో గాంధీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్దిలపాలెంలో విషాదం

మద్దిలపాలెం రామాలయం వీధికి చెందిన గుడ్ల రజని మృతిని స్థానికులు, కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. రజని భర్త గుడ్ల లక్ష్మణరెడ్డి ఆటోడ్రైవర్. రజనికి దైవభక్తి ఎక్కువ. ముక్కోటి ఏకాదశి రోజున వెంకటేశ్వరస్వామిని వైకుంఠ ద్వారంలో దర్శనం చేసుకుంటే మంచిదని భావించి దర్శన టికెట్ల కోసం స్థానికంగా టీటీడీ కల్యాణ మండపంలో ప్రయత్నించారు. ఇక్కడ లభ్యం కాకపోవడంతో భర్త లక్ష్మణరెడ్డితో కలిసి రజని ఈనెల 6న తిరుపతి వెళ్లారు.రామానాయుడు స్కూల్ టోకెన్ల జారీ కేంద్రంలో క్యూలో నిల్చున్నారు. గేట్లు తెరిచిన వెంటనే భక్తులు పరుగులు తీయడంతో జరిగిన తొక్కిసలాటలో రజని కిందపడిపోగా, భక్తులు ఆమెను తొక్కుకుంటూ వెళ్లిపోవడంతో మృతి చెందారు. రజని మృతి వార్త తెలుసుకున్న బంధువులు హుటాహుటిన తిరుపతి బయలుదేరి వెళ్లారు. అమెరికాలో చదువుతున్న కుమారుడు హర్షిత్‌రెడ్డికి సమాచారం అందించారు. అతడు శుక్రవారం మధ్యాహ్నానికి చేరుకుంటాడని తెలిసింది. రజని మృతదేహం గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉదయం మద్దిలపాలెం చేరుకుంటుందని, సాయంత్రం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

తిరుపతి ఘటన విచారకరం

తగరపువలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల విక్రయం వద్ద జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మృతి చెందడం దురదృష్టకరమని జీవీఎంసీ రెండో వార్డు కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు అన్నారు. గురువారం వారు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను టీటీడీ, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చిట్టివలస హైస్కూల్‌కు తాగునీటి సౌకర్యం

తగరపువలస, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యార్థం దివీస్ యాజమాన్యం నిర్మించిన గొట్టపు బావిని ఎంఈఓ శివరాణి గురువారం ప్రారంభించారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు దివీస్ యాజమాన్యానికి తెలియజేయడంతో వారు రూ.1.89 లక్షలతో గొట్టపు బావి నిర్మించి దానికి పంపుసెట్‌ను అమర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ రోజామణి దివీస్ కంపెనీ సామాజిక సేవా విభాగం అధికారి సురేశ్‌కుమార్, శ్రీనివాస్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం గ్రామంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తన సొంత నిధులతో 200 మంది నిరుపేదలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు దాట్ల ప్రసాదరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు గురువారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలకు 304 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మోహనరావు, ఎస్బీ డీఎస్పీ అప్పారావు, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్లు టి. లక్ష్మి, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.


భీమిలిలోని డైట్ కళాశాలలో జరిగిన వేడుకల్లో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

భీమునిపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి.పల్లె కళ ఉట్టిపడేలా అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన గోదా కల్యాణం ఎంతగానో ఆకట్టుకుంది.గంగిరెద్దుల వేషధారణలు, రంగవల్లులు, సోదమ్మ కథలు, చిలక జోస్యం, డప్పు వాయిద్యాలు, హరిదాసు ప్రదర్శనలతో పండగ కళ నెలకొంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి మాట్లాడుతూ గోదా కల్యాణాన్ని విపులంగా వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, పండగలను నేటి తరానికి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఛాత్రోపాధ్యాయులు పండుగల విశేషాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్. సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, జె. మాధవి, ఎం. మహాలక్ష్మి, ఎస్. త్రినాథరావు, ఎన్. నీలిమ, పి. హరిణి పాల్గొన్నారు.

పాండ్రంగి ఉన్నత పాఠశాలలో...

పద్మనాభం రూరల్ : మండలంలోని పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. భోగి మంటలు, రంగవల్లికలు, గాలిపటాల ఎగరవేతతో సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. అలాగే విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గిరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింహాచలం : సింహాచలం దేవస్థానం ఆధీనంలో నిర్వహిస్తున్న సంస్కృత ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం భాను, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణాన్ని రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. భోగి మంట వేసి, దాని చుట్టూ విద్యార్థులు ఆడుతూ పాడుతూ పండగ వాతావరణాన్ని కల్పించారు.అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు హెచ్‌ఎం బహుమతులు ప్రదానం చేశారు.


గోదా, రంగనాయకుల వేషధారణ

గీతంలో ...

సాగర్‌నగర్ : గీతం యూనివర్సిటీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు తనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులతో అలరించారు. విద్యార్థినులు క్యాంపస్‌లోని రహదారులను అందమైన ముగ్గులతో నింపేసి, సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండల కేంద్రంలోని ది ష్లే స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాలయ దుస్తులతో, వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

భీమునిపట్నం (రూరల్) : తాళ్లవలస తిరుమల పాఠశాలలో కూడా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేవిధంగా పాఠశాల ఆవరణలో చిన్న చిన్న గుడిసెలు నిర్మించి, పల్లె వాతావరణం కల్పించారు.

పాడైన రోడ్లు పరిశీలన

కొమ్మాది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు పీఎంపాలెం కాలనీలో మరమ్మతుతో ఉన్న పలు రోడ్లను జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ శాంతిరాజు, డీఈ వెంకట్రావు గురువారం పరిశీలించారు. కాలనీలోని రోడ్ల పరిస్థితిని టీడీపీ సీనియర్ నాయకుడు జీవన్‌కుమార్ వారికి వివరించారు. అనంతరం వారు రోడ్ల మరమ్మతుకు రూ. 18 లక్షలతో అంచనాలు రూపొందించారు. త్వరలోనే రోడ్ల మరమ్మతు చేపడతామని ఈఈ శాంతిరాజు చెప్పారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. పల్లకిలో ఉంచిన గోదాదేవికి మంత్రోచ్చారణల నడుమ బేడా మండప తిరువీధి జరిపారు. అనంతరం ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురాల విన్నపాలు జరిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని వసంతవిహార్ ప్రాంతంలో టీడీపీ నాయకులు గురువారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి నీలాపు అప్పలరెడ్డి, వార్డు కార్యదర్శి నాగేశ్వరరావు, వసంతవిహార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వీల్ చైర్లు వితరణ

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, గర్భిణులు, వయో వృద్ధుల వినియోగం కోసం నగరానికి చెందిన గుడెల శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతులు రెండు వీల్‌చైర్లు వితరణగా ఇచ్చారు. దేవస్థానం ప్రొటోకాల్ సహాయ కార్యనిర్వాహణాధికారి వి.రాంబాబు, సిబ్బంది సూర్యనారాయణకు దాతలు గురువారం వీటిని అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబీకులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, ప్రసాదాలను అందజేశారు.

ముక్కోటి ఏకాదశికి సింహగిరి ముస్తాబు

... 3వ పేజీ తరువాయి

స్వామివారి దర్శనాలు లభించవు. 4 నుంచి 6 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. రాత్రి 7 గంటలకు రాత్రి ఆరాధన ఉంటుంది. ఆ సమయంలో భక్తులకు దర్శనాలు నిలుపుదల చేస్తారు. ప్రత్యేక ఉత్సవం కారణంగా ఆలయంలో ఆర్జిత సేవలన్నీ గురువారం రద్దు చేశారు. అనువంశిక ధర్మకర్త, ఆయన కుటుంబ సభ్యులకు మినహా ఇతరులకు అంతరాలయ ప్రవేశం ఉండదు. అన్న ప్రసాద విభాగం ద్వారా భక్తులకు అసంఖ్యాకంగా భోజన వసతి కలిపిస్తున్నారు. సింహగిరిపై శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి రూ.500 ఉత్సవ ప్రత్యేక దర్శన టికెట్లు ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు లక్ష లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర రాజగోపురంతోపాటు ఆలయంలో పలు ప్రాంతాలను సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పమాలికలతో అలంకరించారు. ట్రాఫిక్, శాంతి భద్రతలు, నిఘా విభాగం, నేర నియంత్రణ విభాగాలకు చెందిన సుమారు 400 మంది పోలీసులు విధుల్లో ఉంటారు. వారిలో ఏసీపీలు ఇద్దరు, సిఐలు 10 మంది, ఎస్‌ఐలు 20 మంది ఉంటారు. గురువారం సాయంత్రానికే ట్రాఫిక్ పోలీసులు సింహాచలం చేరుకున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

... 3వ పేజీ తరువాయి

ఏసీ స్లీపర్ రూ.3,200 నుంచి రూ.5,800కి పెంచేశారు. బస్సుల కేటగిరీని బట్టి నాన్ ఏసీ స్లీపర్ రూ.2,500 నుంచి రూ.3,200కి పెంచేశారు. వీటితోపాటు విజయవాడ నుంచి తిరుగు ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, 16,17 తేదీల్లో ఏసీ స్లీపర్ టిక్కెట్ రూ.1,500 నుంచి 2,500 మధ్య ఉంది. నాన్ ఏసీ స్లీపర్ రూ.1,500, అదే నాన్ ఏసీ చైర్ అయితే రూ.970 నుంచి రూ.1,100 మధ్య పెంచడం విశేషం. విశాఖ నుంచి ప్రతిరోజూ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు 54 ట్రావెల్స్ సంస్థలకు చెందిన 110 బస్సులు వెళుతుంటాయి. పండుగ సీజన్‌లో వీటి సంఖ్య కొంతవరకూ పెరుగుతుంది. ఈ లెక్కన సంక్రాంతి సీజన్‌లో వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ మూడు వేల మంది నగరానికి వస్తారు. వీరంతా పండుగ తర్వాత తిరుగు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. అందరిపైనా టిక్కెట్ పెంపు భారం పడుతుంది. ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలను పెంచేయడం దిగువ, మధ్య తరగతికి చెందినవారికి పెద్దసమస్యగా మారింది. దీనిపై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ చార్జీల కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో రేట్లు...ఆర్టీసీ చార్జీలకు సమానంగా ఉండాలి. అంతకు మించి వసూలుచేస్తే చర్యలు తీసుకుంటాం. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు రేట్లు పెంచుతున్నారనే ప్రచారం నేపథ్యంలో నియంత్రణకు కార్యాచరణ రూపొందించాం. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేస్తున్నాం. అధిక చార్జీలు వసూలుచేస్తే జరిమానాలు విధిస్తాం. ప్రత్యేక బృందాలతో బస్సుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం. ఎవరైనా ట్యాక్స్‌లు కట్టకుండా బస్సులను తిప్పుతున్నట్టయితే సీజ్ చేస్తాం.

ఆదినారాయణ, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్

అష్టలక్ష్మీ ఆలయంలో దీపోత్సవం


ఆలయంలో వెలిగించిన దీపాలు

కొమ్మాది, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) :అన్నంరాజు నగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవికి, అష్టలక్ష్మీ అమ్మవార్లకు గురువారం దీపోత్సవం నిర్వహించారు. మహిళలు ఏక కాలంలో వెయ్యినొక్క దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి దీపోత్సవం విశేషాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ,రమాదేవి దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో సీఐటీయూ నిరసన

మధురవాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోసం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎటువంటి ప్రకటన చేయకపోవడం సరికాదని సీఐటీయూ నాయకులు విమర్శించారు. గురువారం వారు స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోరుతూ మధురవాడ జోన్ సీటూ ప్రధాన కార్యదర్శి రాజుకుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి అప్పలరాజు, గురుమూర్తిరెడ్డి, రామప్పడు, గోవింద, రాంబాబు పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలో గీత కార్మికులకు అన్యాయం'

ఆనందపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురంలోని కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవా సంఘం భీమిలి నియోజకవర్గం కల్లు గీత సహకార సంఘాల అధ్యక్షులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంగటి రాము మాట్లాడుతూ వైసీపీ పాలనలో గీత కార్మికులకు అన్యాయం జరిగిందని, ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పది శాతం షాపులు కేటాయించడం హర్షనీయమని చెప్పారు.

విమ్స్‌లో హెచ్‌ఎంపీవీ ప్రత్యేక వార్డు

... 3వ పేజీ తరువాయి

కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అయితే ఈ వైరస్‌కు సంబంధించి వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని, ప్రాణాంతకం ఏమీ కాదని ఆయన చెప్పారు. సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలు కనిపిస్తాయన్నారు. జ్వరం, గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటివి హెచ్‌ఎంపీవీ లక్షణాలుగా పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది అని ఆయన ఈ తెలిపారు.



భీమిలి పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న జడ్సీ ప్రసన్న వాణి, తదితరులు



మధురవాడ : వుడా కాలనీలో ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది, కూటమి నాయకులు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

భీమునిపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడమే జీవీఎంసీ ప్రధాన లక్ష్యమని జోనల్ కమిషనర్ ప్రసన్నవాణి అన్నారు. సే నో టు ప్లాస్టిక్ ఉద్యమానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. గురువారం జీవీఎంసీ అధికారులు పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారిని పట్టణం నుంచి తరిమికొట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సే నో టు ప్లాస్టిక్ స్టిక్కర్లను దుకాణాలకు అతికించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, టీఎన్‌టీయూసీ నాయకులు వియ్యపు పోతురాజు, సచివాలయం పర్యావరణ కార్యదర్శి కేవీ రామశర్మ పాల్గొన్నారు.

మధురవాడ/కొమ్మాది : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలు నిషేధించాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కోరారు. జీవీఎంసీ అధికారులు గురువారం 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలథిన్ కవర్లు, పలు చటి ప్లాస్టిక్ సంచులు వల్ల జీవకోటికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేన్సర్ కారకాలు వీటిలో ఇమిడి ఉండడం వల్ల మనుషులతో పాటు మూగజీవాలు రోగాల బారిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పీఎంపాలెంలో ర్యాలీ చేస్తున్న జీవీఎంసీ అధికారులు

ఆరో వార్డు పీఎంపాలెంకాలనీలోని వ్యాపారులకు, చిరు వర్తకులకు ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ జోన్ 2 ఏఎంహెచ్ఓ డాక్టర్ కిశోర్, ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కేన్సర్ బారిన పడతామని, మూగజీవులు ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. అలాగే పర్యావరణానికి కూడా ముప్పు కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకుండా గుడ్డతో తయారు చేసిన సంచులను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యార్లగడ్డ జీవన్‌కుమార్, జనసేన నేత సంతోష్ నాయుడు, సత్యవేణి, సర్వదేవుళ్లు, షేక్ సుభాణి, పాల్గొన్నారు. ఐదో వార్డు శివశక్తినగర్‌లోనూ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాస్, యూడీసీ సీఓ ఆదినారాయణరెడ్డి, టీడీపీ నాయకుడు నమ్మి శ్రీను పాల్గొన్నారు.

వైసీపీలో అయోమయం

... 3వ పేజీ తరువాయి

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు తమ ఆసక్తిని వ్యక్తంచేశారు. కానీ వారి కంటే మరెవరైనా దొరుకుతారేమోననే అధిష్ఠానం వేచి చూస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మొల్లి అప్పారావు తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ద్వారా అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

భీమిలి వెళ్లడానికి నో చెప్పిన అమర్‌నాథ్

భీమిలి సమన్వయకర్తగా ఇంతవరకూ పనిచేసిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇటీవల పార్టీకి గుడ్‌బై చెప్పారు. ముత్తంశెట్టి స్థానంలో బాధ్యతలు చేపట్టాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అధిష్ఠానం సూచించగా, ఆయన నిరాకరించినట్టు ప్రచారం జరుగుతోంది. తనకు పెందుర్తి లేదంటే అనకాపల్లి జిల్లాలోని ఏదైనా నియోజకవర్గం అప్పగించాలని అమర్ కోరినట్టు సమాచారం. దీంతో భీమిలి సమన్వయకర్తగా ఎవరైనా సమర్థుడు పేరు సూచించాలని పార్టీ నేతలను అధిష్ఠానం కోరినట్టు చెబుతున్నారు. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీనుతో భీమిలి సమన్వయకర్త బాధ్యతలు చేపట్టడంపై చర్చించగా, తనకు వద్దని అవకాశం ఉంటే ఎస్.కోట లేదంటే ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఏదో ఒకటి అప్పగించాలని స్పష్టం చేసినట్టు నేతలు చెబుతున్నారు. దీంతో సమన్వయకర్తను నియమించేంత వరకూ భీమిలి బాధ్యతలను చూడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌కు సూచించినట్టు తెలిసింది. మరోవైపు గాజువాక సమన్వయకర్త బాధ్యతల పట్ల అమర్‌నాథ్ ఆసక్తి చూపకపోవడంతో ఆయన స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్టు నేతలు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుటుంబసభ్యులు ఆసక్తి చూపుతున్నారని, వారిలో ఒకరికి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల నుంచి జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టబోతుండడంతో ఆలోగానే సమన్వయకర్తలు లేని చోట కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్టు నేతలు చెబుతున్నారు.

సెల్‌ఫోన్లు వినియోగించాం

... 3వ పేజీ తరువాయి

జైలుకు వచ్చాడు. మరో రౌడీషీటర్ యు.రాజేష్ రిమాండ్ ఖైదీ. ఇతడు జూన్ 17 నుంచి కేంద్ర కారాగారంలో ఉంటున్నాడు. ఇటీవల సెల్‌ఫోన్లు కలకలం రేపిన నేపథ్యంలో వీరిద్దరిపై అనుమానం వచ్చిన అధికారులు వారిని ప్రశ్నించగా తాము జైలుకు వచ్చిన తరువాత సెల్‌ఫోన్లు వినియోగించిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇందుకు జైలు సిబ్బంది సహకరించారని కూడా చెప్పారన్నారు. అయితే ఎవరెవరితో మాట్లాడారో తెలుసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. దీంతో విషయాన్ని ఆరిలోవ పోలీసులకు తెలిపామన్నారు. కాగా వీరిపై భద్రతాపరంగా వస్తున్న పలు అభియోగాలతో గత నెల 31 నుంచి ఇద్దరినీ మరో బ్యారక్‌కు మార్చామని వివరించారు. కాగా ఇక్కడి జైలు నుంచి బదిలీ చేసిన 37 మంది వార్డర్ల స్థానంలో ఇప్పటివరకూ 13 మంది కొత్తవారు వచ్చి చేరారని, మరో 14 మంది కోర్టును ఆశ్రయించారని తెలిపారు.

ఇంటర్వ్యూ..

శత శాతం పన్నుల వసూళ్లకు కార్యాచరణ

-జోన్-8 జెడ్సీ హేమావతి



పెందుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-8 పరిధిలో వార్డుల్లో మొత్తం హౌస్ ఎసెస్‌మెంట్స్ 80,619 ఉండగా, వీటి ద్వారా పన్నుల రూపంలో రూ.31,52,07,682 కోట్లు వసూలు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.17,89,63,721 కోట్లు వసూలైనట్టు జోనల్ కమిషనర్ హేమవతి తెలిపారు. వార్షిక ఏడాది మార్చి నెలాఖరు నాటికి శత శాతం పన్నుల వసూళ్లకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్టు 'ఆంధ్రజ్యోతి'కి ఆమె వివరించారు.

ప్రశ్న: ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటారా?

జవాబు: మొండి బకాయిదారులకు ముందుగా నోటీసు అందజేసి ప్రాపర్టీ జప్తునకు చర్యలు తీసుకుంటాం. పన్ను ఎగవేతదారులపై కూడా తగిన చర్యలు చేపడతాం.

ప్ర: ప్లాస్టిక్ నిషేధం అమలెలా ఉంది?

జ: దీనిపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో పాటుగా వాటిని విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుని జరిమానా విధిస్తాం. సే నో టు ప్లాస్టిక్ స్టికర్లు అతికించి ఓఆర్ స్కాన్ కోడ్‌తో వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: పారిశుధ్య నివారణకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయా?

జ: జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరాయంగా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తించేలా చూస్తున్నాం. విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

ఆస్పత్రిలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

అగనంపూడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో దాతలు సమకూర్చిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గురువారం 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ఆస్పత్రి సూపరింటెండెంట్ భారతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులకు మినరల్ వాటర్‌ను అందించేందు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాతలు వేణుగోపాలన్ నాయర్, శివప్రియ, అజిత్‌కుమార్, వైద్యులు ఉష, గోపీకృష్ణ, స్థానిక నాయకులు ఇల్లపు ప్రసాద్, బి.సత్యనారాయణ, జి.అప్పారావు, తిలక్, తాతారావు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

పెదగంట్యాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేత్ర రోగులకు అవసరైన కళ్లద్దాలను అదానీ ఫౌండేషన్, గంగవరం పోర్టు ప్రతినిధులు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. వారం రోజుల క్రితం రోగులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేసి కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించారు. గంగవరం పోర్టు సీఎస్ ఆర్ నిధులతో కళ్లద్దాలు తయారు చేయించి 126 మందికి నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో అందజేశారు. అదానీ ఫౌండేషన్, గంగవరం పోర్టు ప్రతినిధి రమేశ్, టీడీపీ నాయకులు నమ్మి అప్పారావు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, శరత్, జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, శ్రీరామ, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), నరసింహ, శ్రీనరసింహ, సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ, తాతా, గణేష్, సప్తగిరి (తగరపువలస), నటరాజ్-1,2 (పెందుర్తి)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 20, క్యారెట్ 42 దొండకాయలు 50, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీర దోస 36,కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 40, కంద 66, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 40, బ్రకోలి 100, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండచుసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

రోడ్డు ప్రమాదాల జోరు.. ప్రజలు బేజారు

- పారిశ్రామిక ప్రాంతంలో నెల రోజుల వ్యవధిలో ముగ్గురి మృతి
- భారీ వాహనాలను ఇష్టానుసారంగా నడపడమే ప్రమాదాలకు కారణమంటున్న ప్రజలు



గాజువాక ప్రాంతంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ద్విచక్ర వాహనదారుడు (ఫైల్ ఫొటో)

గాజువాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ద్విచక్ర వాహనదారులు ద్విచక్ర వాహనాలతో రోడ్డు ఎక్కేందుకు భీతిల్లుతున్నారు. గత కొద్దికాలంగా వరుసగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడ్డారు. భారీ వాహనాలను నిర్లక్ష్యంగా, మితిమీరిన వేగంతో నడపడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం వల్లే ద్విచక్ర వాహనదారులు బలవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. నెల రోజుల వ్యవధిలో గాజువాక ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ద్విచక్ర వాహనదారులు మృతి చెందారు. చినగంట్యాడలో రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఫార్మా కంపెనీ ఉద్యోగి కన్నుమూయగా, పది రోజుల క్రితం సుందరయ్య కాలనీ వద్ద జరిగిన ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి చెందారు.

అలాగే ఇరవై రోజుల క్రితం ఆటోనగర్ జరిగిన ప్రమాదంలో మరో వ్యక్తి మృతి చెందాడు. ఇలా తరచూ జరుగుతున్న ప్రమాదాల వల్ల ఎంతోమంది మృతి చెందగా, మరెంతోమంది క్షతగాత్రులుగా మారారు. గాజువాక ప్రాంతంలో వాహనాల తాకిడి అధిక సంఖ్యలో పెరగడం, వాహనాల తాకిడికి తగ్గట్టుగా రహదారులు సువిశాలంగా లేకపోవడంతో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాటి నియంత్రణ దిశగా ట్రాఫిక్ పోలీస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా భారీ వాహనాల మూలంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరగడంతో వాటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పట్టణ పరిధిలో ప్రధాన రహదారులు, కీలక మార్కెట్లు, జంక్షన్లలోకి రద్దీ సమయాల్లో వాహనాలను అనుమతించడం లేదు. అందరు వాహనదారులు పూర్తి స్థాయిలో నిబంధనలను పాటించేలా చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

నేడు ఉత్తరద్వారంలో శ్రీవారి దర్శనాలు

- వైకుంఠ ఏకాదశి సందర్భంగా ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయాలు
- భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు



ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం

గాజువాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శ్రీవారు ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఇక్కడి వినాయకనగర్ వుడా కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. వేకువజాము నుంచే ఉత్తర ద్వారంలో శ్రీవారం దర్శనమిస్తారని, అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా తగిన చర్యలు చేపడుతున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అలాగే పలు ఆలయాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్ శ్రీకృష్ణ ఆలయంలో, 86వ వార్డు రాజులపాలెం, 88వ వార్డు గ్రీన్ సిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు వైకుంఠ ఏకాదశి పూజలకు ముస్తాబయ్యాయి. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గ్రీన్ సిటీలోని శ్రీవారికి పంచామృతాభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని బంగారు, వెండి ఆభరణాలు, తులసీ మాలలతో సుందరంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం పలువురు భక్తులు అన్నమాచార్యుని భక్తి గీతాలను ఆలపించారు.

అక్కిరెడ్డిపాలెం: వైకుంఠ ఏకాదశి పూజలకు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయక దేవస్థానంతో పాటు శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం సర్వాంగ సుందరంగ ముస్తాబయ్యాయి. ప్రసన్నగిరిపై గల ఆలయంలో శుక్రవారం వేకువజాము నాలుగు గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వారంలో శ్రీవారి దర్శన భాగ్యం భక్తులకు లభిస్తుందని ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు తెలిపారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేకువజాము మూడు గంటలకు సుప్రభాత, తోమాల సేవ, నాలుగు గంటలకు ధర్మకర్తలచే ఉత్తర ద్వార పూజ, శ్రీవారికి విశేష పూజలు చేశాక భక్తులను దర్శనాలకు వదులుతారు.

పెందుర్తి: స్థానిక వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు వైకుంఠ (ఉత్తర) ద్వారంలో దర్శనం ఇవ్వనున్నారు. తిరుప్పావై అనంతరం వేకువజాము నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారు. ఇందుకోసం క్యూలైన్లు, చలువ పందిళ్లు, బారికేడ్లు, టెంట్లు, తాగునీరు, తదితర ఏర్పాట్లు చేశారు.

యమ డేంజర్

- అధ్వానంగా పంప్‌హౌస్‌లు
- ప్రమాదకరంగా స్విచ్ బోర్డులు
- భయంభయంగా సిబ్బంది విధి నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



ఊడిపోవడానికి సిద్ధంగా ఉన్న స్విచ్ బోర్డు



కటౌట్లు లేకుండా ఉన్న ఫ్యూజ్‌లు

మల్కాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ పంప్‌హౌస్‌లలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఈ పంప్‌హౌస్‌లలో నీటిపంపింగ్ చేసినప్పుడు స్విచ్ ఆన్ చేయడానికి వెళ్తే ఏం ప్రమాదం ముంచుకొస్తుందో అన్నట్టుగా బోర్డులు తయారయ్యాయి. ఏ విద్యుత్ తీగ ఎప్పుడు ఊడి పడుతుందో అన్న భయం కలుగుతోంది. దీంతో అక్కడ పనిచేసే సిబ్బంది పంప్‌హౌస్‌లోకి వెళ్లేందుకే వెనుకంజ వేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన ట్యాంకు పైన వేసిన చెక్క పలకలు



స్విచ్‌బోర్డు నుంచి వేలాడుతున్న వైర్లు

ఇక్కడ విధులు నిర్వహించే వారు ఈ పంప్‌హౌస్‌లలో అర్ధరాత్రి, తెల్లవారు జాము సమయాల్లోనే ఉండాలి. ఆ సమయాలలో పంప్‌హౌస్‌లో విద్యుత్ దీపాలు కూడా వెలగవు. దీంత సిబ్బంది చేసేది లేక ఓ అంచనా మీద పంప్‌హౌస్‌లోకి వెళ్లి విద్యుత్‌ను ఆన్ చేసి నీటిని పంపింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. అంతేకాకుండా నీటి ట్యాంక్‌పై ఉన్న సిమెంట్ దిమ్మెలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే కొన్ని చోట్ల ట్యాంక్‌లపై చెక్కలు వేశారు. ఆ చెక్కలు ఎప్పుడో వేసినవి కావడంతో బాగా నానిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ ఈ పంప్‌హౌస్ మరమ్మతుకు చర్యలు తీసుకోవడమే లేదు. దీంతో దినదిన గండంగా సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ పంప్‌హౌస్‌లలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి., ఇప్పటికైనా అధికారులు స్పందించి పంప్‌హౌస్‌లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

మోదీ, బాబు, పవన్‌లతో రాష్ట్రానికి తీరని అన్యాయం

- సీపీఎం నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

మల్కాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయబోమని విశాఖ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయడం అన్యాయని సీపీఎం జోన్ నేతలు విమర్శించారు. తద్వారా రాష్ట్రానికి ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలిసి తీరని అన్యాయం తలపెడుతున్నారంటూ మండిపడ్డారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో శ్రీహరిపురం జీవీఎంసీ వాకింగ్ ట్రాక్ వద్ద నిరసన చేపట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సభలో నేతలందరూ ఒకరినొకరు పొగుడుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో జోన్ నాయకులు కె.రమణ, రాంబాబు, సూరిబాబు, అప్పారావు, అప్పలనాయుడు, సత్యారావు, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి : ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణపై కనీస ప్రకటన చేయకపోవడం దారుణమని, మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ త్రయం ఆంధ్ర ద్రోహులని ఆరోపిస్తూ గోపాలపట్నం సీపీఐ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సుజాతనగర్ జంక్షన్‌లో గురువారం నిరసన చేపట్టారు. జోన్ కార్యదర్శి జగన్ మాట్లాడుతూ విశాఖ సాక్షిగా ఆంధ్రులకు మోదీ ద్రోహం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో శంకరరావు, సత్యనారాయణ, జక్కన్న పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణతో ట్వింకిల్ స్కూల్ విద్యార్థినులు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

ఆటోనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్‌లో గల ట్వింకిల్ స్కూల్ ఆవరణలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. గొబ్బెమ్మలు, గంగిరెద్దులాట, హరిదాసు కీర్తనలతో సంబరాలు సందడిగా సాగాయి. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు పాఠశాల డైరెక్టర్ డి.శ్యామ్, ప్రిన్సిపాల్ కరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్: స్థానిక రామకృష్ణ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను సందడిగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, హరిదాసుతో పాటు వివిధ వేషధారణలతో అలరించారు. ఈ వేడుకల్లో డెన్మార్క్ నుంచి వచ్చిన డామినిక్, పేర్ని అనే వారు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పెందుర్తి రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి సుజాతనగర్‌లో గల రవీంద్రభారతి నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డూడూ బసవన్నలు, హరిదాసుల కీర్తనలు అలరించాయి.

ప్రహ్లాదపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు



ప్రహ్లాదపురంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

వేపగుంట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్పొరేటర్ రాపర్తి కన్నా, టీడీపీ వార్డు అధ్యక్షుడు గంగ వరహాలు ఆధ్వర్యంలో సుమారు 150 సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా రాపర్తి కన్నా మాట్లాడుతూ శుక్రవారం శ్రీనివాసనగర్‌లో సభ్యత్వాలను స్వీకరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, నేతలు అప్పలనర్సమ్మ, చిన్ని, వరహాలు, జి.మహేష్, కర్రి పైడిరాజు, గాంధీ పాల్గొన్నారు.

86వ వార్డులో 5,500 సభ్యత్వాలు పూర్తి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీ, రాజీవ్ నగర్, వుడా నగర్, యాతపాలెంలలో గురువారం చేపట్టిన టీడీపీ సభ్యత్వాలతో ఆ సంఖ్య 5,500కు చేరింది. ఈ సందర్భంగా వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ కార్యకర్తల పార్టీ తెలుగుదేశమేనని అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, నాగార్జున, తేజ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

పెందుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లిన డిగ్రీ విద్యార్థిని దృశ్యమైన ఉదంతంపై పెందుర్తి పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక కోట్నివానిపాలెంలో నివాసముంటున్న నాగమణి కుమార్తె పల్లవిసన్న (19) పెందుర్తిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బుధవారం కళాశాలకు వెళ్లిన పల్లవి తిరిగి ఇంటికి చేరుకోలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్లలో వెతికాని కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.



బోసియా పోటీలకు సిద్ధం చేసిన క్రీడా ప్రాంగణం

నేటి నుంచి జాతీయ స్థాయి బోసియా పోటీలు

గాజువాక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు శుక్రవారం నుంచి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జాతీయ స్థాయి బోసియా చాంపియన్‌షిప్ పోటీలను మెడ్‌టెక్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 103 మంది దివ్యాంగ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీలు ఈ నెల 15వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న అంతర్జాతీయ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీల నిర్వహణ కోసం మెడ్‌టెక్ జోన్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సువిశాలమైన క్రీడాప్రాంగణంలో కోర్టులను ఏర్పాటు చేశారు.

క్రీడలతో యువతలో క్రమశిక్షణ పెంపు

పెదగంట్యాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల యువతలో క్రమశిక్షణ, పట్టుదల పెరుగుతాయని ఇంటక్ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కురందాసు వంశీకృష్ణ అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని సీతానగరం గ్రౌండ్‌లో గురువారం నాలుగు రోజుల పాటు జరిగే వైజాగ్ విండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడల వల్ల యువత ఉత్తేజకరంగా ఉండడంతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటరమణ, గ్రామ పెద్దలు మొల్లి చిన్న, ఎస్.సింహాద్రి, ఎస్.సింహాచలం, చట్టి వెంకటేశ్,తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై అవగాహన

అగనంపూడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఈసీఎం విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ (సీడీఏసీ) జాయింట్ డైరెక్టర్ ఎం.కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ ప్రాముఖ్యం, భవిష్యత్తు ఆవశ్యకత, ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లాంటి విభాగాల్లో పరిశోధనలు జరిపి సామాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఉమామహేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 1,251 అర్జీలు



వీఆర్వోలతో సమావేశమైన తహసీల్దార్

పెందుర్తి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల్లో 1251 అర్జీలు అందినట్టు తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ తెలిపారు. ఇందులో 469 అర్జీలకు పరిష్కారం లభించగా, 782 పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. గురువారం ఆయన మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్జీలను విభజన ఈ నెల 31నలోగా పరిష్కారం చూపాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీటీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ఎన్ఏడీ జంక్షన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో రూ.1.24 కోట్లతో చేపట్టనున్న రక్షణ గోడ నిర్మాణానికి గురువారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాలు ప్రాంతంలో కొండచరియలు విరిగి పడినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ గోడ నిర్మాణం వల్ల కొంత రక్షణ ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, టీడీపీ నాయకులు శ్రీనివాస పట్నాయక్,సతీశ్,రామోజీ,జ్యోతి, ధనలక్ష్మిమాధవి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులంతా సహకరించాలి: డిప్యూటీ మేయర్ శ్రీధర్

పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు

ఎన్ఏడీ జంక్షన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడా కాలనీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని కాలనీలో దుకాణాలు తిరుగుతూ ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటర్ ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింధియా: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధపై జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవ, చింతలలోవ, క్రాంతినగర్‌లో గురువారం అవగాహన కల్పించారు. స్థానిక కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు ఉంటాయని, అందుకేదూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది, మెడికల్ ఇన్‌చార్జి సచివాలయ కార్యదర్శులు, పలువురునాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని జడ్సీ హేమవతి అన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదని స్పష్టం చేశారు. స్థానిక రైతుబజార్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. పలు వ్యాపార దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు, కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి షర్మిల, సహాయకులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా అందరూ క్లాత్ సంచులను వాడాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కోరారు. వడ్లపూడి, కణితిలలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయనీ, మనుషులతో పాటు మూగజీవాలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడుతున్నట్టు పేర్కొన్నారు. అందువల్ల ప్లాస్టిక్‌కు బదులుగా ప్రజలందరూ కాగితాలు, ఆకులు, క్లాత్ సంచులు, స్టీల్ బాక్సులు, గ్లాసులు, ప్లేటులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయ రామరాజు,మాటూరి రాము,సూరిశెట్టి పెంటారావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో ప్లాసిక్ కవర్లు నిషేధించారని, ప్లాసిక్ వాడకం వల్ల క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా క్లాత్, నార సంచులు, స్టీల్ బాక్స్‌లను వినియోగించాలని కోరారు. పలు దుకాణాలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

పూర్ణామార్కెట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉత్తర ద్వారం గుండా శ్రీవారి దర్శనానికి వన్‌టౌన్ ఏరియాలోని పలు వైష్ణవాలయాలను అధికారులు సిద్ధం చేశారు. టౌన్ కొత్త రోడ్డు శ్రీజగన్నాథస్వామి, బురుజుపేట ఎంబరుమన్నార్ వెంకటేశ్వర స్వామి, పోర్టు వెంకటేశ్వరుడి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా క్యూలైన్లు, వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు టౌన్ కొత్త జగన్నాథుడి ఆలయం ఈవో రాజగోపాలరెడ్డి తెలిపారు. ఉచిత దర్శనాలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

లావణ్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటనలో మృతిచెందిన ఎస్.లావణ్య భర్త సతీష్‌ను, ఆమె కుటుంబ సభ్యులను ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు గురువారం పరామర్శించారు. వేంకటేశ్వర కాలనీలోని వారి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ తదితరులు ఉన్నారు.

మందుబాబులకు హెచ్చరిక



వన్‌టౌన్ ఏరియాలో రాత్రి వేళ పోలీసుల గస్తీ

జగదాంబ కూడలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ వేళ మందుబాబులకు వన్‌టౌన్ పోలీసులు హెచ్చరికలు చేశారు. యువత, మందుబాబులు దుందుడుకు చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సీఐ దేముడుబాబు స్పష్టం చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి పలు ప్రాంతాల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేశారు. వన్‌టౌన్ ఏరియాలో రాత్రి 10 గంటల తరువాత మద్యం తాగి రోడ్లపై అడ్డగోలుగా సంచరిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. గాంధీ బొమ్మ, పాతపోస్టాఫీసు, బురుజుపేట, కురుపాం మార్కెట్‌లోని పలు వీధుల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హెచ్‌బీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతమ్మధార డాక్టర్స్ కాలనీ, సింహాద్రిపురం, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

'బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్ అంశం ప్రస్తావించకపోవడం అన్యాయం'

అక్కయ్యపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించకపోవడం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకుడు యూఎస్ఎన్ రాజు అన్నారు. తాటిచెట్లపాలెంలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ బహిరంగ సభలో ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు తమ ప్రసంగాల్లో కనీస ప్రస్తావన చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరీష్, కుసుమ, కోటయ్య, కన్నయ్య, సూర్యకుమారి పాల్గొన్నారు.

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయవద్దని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వినతిపత్రం అందచేసినట్లు అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాడి సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వమే నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రామచంద్రానగర్‌లో ఫ్యూజ్‌బాక్స్ ఇలా..

అక్కయ్యపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43, 44 వార్డుల్లోని 80 అడుగుల రోడ్డు రామచంద్రానగర్ రహదారిపై ఉన్న విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ ప్రమాదానికి నిలయంగా మారింది. దీనివల్ల అటువైపు రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు. ఈ ఫ్యూజ్‌బాక్స్ నుంచి వైర్లు, తలుపులు ఊడిపోయి ఉండడాన్ని చూస్తే విద్యుత్‌శాఖ సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. అధికారులు స్పందించి ఈ ఫ్యూజ్‌బాక్స్‌ను సరిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



పూర్ణామార్కెట్ ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తున్న అధికారుల బృందం

జగదాంబ కూడలి/అల్లిపురం/సీతమ్మధార/మాధవధార, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగానికి పూర్తిగా స్వస్తి చెప్పి, గుడ్డ, నార సంచులను ఉపయోగించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు, వ్యాపారులకు సూచించారు. పూర్ణామార్కెట్, అల్లిపురం, సీతమ్మధార, మాధవధార ప్రాంతాల్లో గురువారం విస్తృతంగా అవగాహన కల్పించారు. కొన్నిచోట్ల దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు 120 మైక్రాన్ల మించి మందం ఉన్న సంచులనే వినియోగించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు సూచించారు. 35వ వార్డు వ్యాపార కూడళ్లలో చైతన్యపరుస్తూ పర్యావరానికి ముప్పు కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా దూరం చేద్దామన్నారు. మన భవిష్యత్ తరాలకు ఆస్తులతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని వారసత్వంగా అందిద్దామని హితవు పలికారు. వ్యాపారులు, ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించగలమన్నారు. ప్లాస్టిక్‌ను ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. పూర్ణామార్కెట్ వరసిద్ధి వినాయక వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్, వల్లభాయ్‌పటేల్ మార్కెట్ వ్యాపారులు, ప్రజారోగ్య విభాగం సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వ్యాపారాలు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అందరి బాధ్యత అని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి దుకాణానికి వెళ్లి ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్య పర్యవేక్షకుడు కాశీరావు, సచివాలయ కార్యదర్శులు జి.శ్యామలరావు, జ్యోతి, ఆర్.రాజేష్, శశిబాల, పవన్, పాల్గొన్నారు. ఎవరు ప్లాస్టిక్ సంచులు వాడినా చర్యలు తీసుకుంటామని సీతమ్మధారలో పారిశుధ్య పర్యవేక్షకుడు ఎస్.పి. వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డిలు స్పష్టం చేశారు. 24, 14 వార్డుల్లో మెడికల్ దుకాణాలు, తోపుడు బండ్లు, దుకాణాల్లో జీవీఎంసీ సిబ్బంది తనిఖీలు నిర్వహించి కొందరికి జరిమానా విధించారు. మాధవధారలో ప్లాస్టిక్ కవర్లు అమ్మకుండా వ్యాపారులకు పారిశుధ్య సిబ్బంది, సచివాలయ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. ప్రజల్లోనూ మార్పు రావాలని ఆకాంక్షించారు. వార్డు సిబ్బంది సుధాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి, తిరిగిరాని లోకాలకు..

... 3వ పేజీ తరువాయి

కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తున్న బంధువులు, స్థానికులతో గాంధీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మద్దిలపాలెంలో విషాదం

మద్దిలపాలెం రామాలయం వీధికి చెందిన గుడ్ల రజని మృతిని స్థానికులు, కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. రజని భర్త గుడ్ల లక్ష్మణరెడ్డి ఆటోడ్రైవర్. రజనికి దైవభక్తి ఎక్కువ. ముక్కోటి ఏకాదశి రోజున వెంకటేశ్వరస్వామిని వైకుంఠ ద్వారంలో దర్శనం చేసుకుంటే మంచిదని భావించి దర్శన టికెట్ల కోసం స్థానికంగా టీటీడీ కల్యాణ మండపంలో ప్రయత్నించారు. ఇక్కడ లభ్యం కాకపోవడంతో భర్త లక్ష్మణరెడ్డితో కలిసి ఈ నెల 6న తిరుపతి వెళ్లారు. రామానాయుడు స్కూల్ టోకెన్ల జారీ కేంద్రంలో క్యూలో నిల్చున్నారు. గేట్లు తెరిచిన వెంటనే భక్తులు పరుగులు తీయడంతో జరిగిన తొక్కిసలాటలో రజని కిందపడిపోగా, భక్తులు ఆమెను తొక్కుకుంటూ వెళ్లిపోవడంతో మృతిచెందారు. రజని మృతి వార్త తెలుసుకున్న బంధువులు హుటాహుటిన తిరుపతి బయలుదేరి వెళ్లారు. అమెరికాలో చదువుతున్న రజని కుమారుడు హర్షిత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నానికి చేరుకుంటాడని తెలిసింది. రజని మృతదేహం గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉదయం మద్దిలపాలెం చేరుకుంటుందని, సాయంత్రం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

మోదీ సభ సక్సెస్.. ఉత్తరాంధ్ర ప్రజల విజయం

- జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణశ్రీనివాస్



మద్దిలపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్డు షో, బహిరంగ సభ సక్సెస్ కావడం ఉత్తరాంధ్ర ప్రజల విజయమని జనసేన నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ పేర్కొన్నారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మోదీ సభకు తరలివచ్చిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, డోలా బాలవీరంజనేయస్వామి, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ శ్రీభరత్, ఉత్తరాంధ్ర కూటమి ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. నగర వేదికగా మోదీ సుమారు రూ.209 లక్షల కోట్లు వరాలుజల్లు కురిపించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నాంది పలికారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ రైల్వేజోన్ భవనానికి శంకుస్థాపన చేసి పట్టాలెక్కించారని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై అసూయతో వైసీపీ నేతలు చేసే విమర్శలను రాష్ట్రాభివృద్ధితో సమాధానం చెబుతామని పేర్కొన్నారు.

'అమర్నాథ్.. చర్చకు సిద్ధమా?'

సీతంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చర్చకు సిద్ధమా? లేదా.. విస్సన్నపేట భూముల్లో ఎంత నొక్కేశారో చర్చకు వస్తే ఇంకా బాగుంటుందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సవాల్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన అయిదేళ్లలో దోచుకోవడం, దాచుకోవడం, ఆక్రమించుకోవడం సిద్ధాంతాలుగా జగన్‌రెడ్డి పాలన సాగిందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు అభివృద్ధి త్రిమూర్తులని, వీరిని ఒకే వేదికపై చూసిన ఉత్తరాంధ్ర ప్రజలకు సంక్రాంతి ముందే వచ్చిందని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పరదాల మాటున తిరిగితే, కూటమి నేతలు ప్రజల మధ్య నుంచి హుందాగా వెళ్లిన విషయాన్ని, వారిపై ప్రజలు పూలవర్షం కురిపించిన తీరును ప్రస్తావించారు.

పాడేరులో ఇద్దరు ట్రెజరీ ఉద్యోగులపై చర్యలు

మహారాణిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాడేరులోని ఇద్దరు ట్రెజరీ ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అక్కడి ట్రెజరీ కార్యాలయంలో ఓ ఎంఈవోకు చెందిన జీపీఎఫ్ బిల్లును వరుసగా రెండుసార్లు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించి అక్కడి సీనియర్ అకౌంటెంట్ బెనర్జీని సస్పెండ్ చేశారు. ఎస్‌టీవో రామకృష్ణకు మెమో జారీ చేశారు. సాధారణంగా ఒక నెలలో అప్‌లోడ్ చేసిన బిల్లును రెండో నెల అప్‌లోడ్ చేయకూడదు. తప్పును గమనించిన ఇద్దరిపై చర్యలు తీసుకున్నారు.

రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి

సీతంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సౌత్ కోస్ట్ రైల్వే జోనల్ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందదాయకమని, దీంతో పాటు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, సెల్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్స్ కూడా సౌత్ కోస్ట్ రైల్వే హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధికి దోహదపడాలని ఉత్తరాంధ్ర బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నరవ రాంబాబు, సౌత్‌కోస్ట్ రైల్వే ఓబీసీ సంఘాల అధ్యక్షుడు పెదిరెడ్డి రాజశేఖర్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

పాలీటెక్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా.కె.నారాయణ, అధ్యాపకులు

కంచరపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెటలర్జీ విభాగం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మెటలర్జీ విద్యార్థులు సాయిరోహిత్, ముఖేష్ సాయిరాం ప్రదర్శించిన 3-డి ప్రింటింగ్ ద్వారా కృత్రిమ ఎముకల తయారీ ప్రాజెక్టు నమూనా విద్యార్థులను ఆకట్టుకుంది. రాష్ట్ర మానవ వనరుల మంత్రి నారా లోకేశ్ నుంచి తృతీయ పురస్కారం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణ తెలిపారు. విద్యార్థులు, మెటలర్జీ విభాగం అధ్యాపకులను ప్రిన్సిపాల్ గురువారం అభినందించారు. ఇదే ఫెస్ట్‌లో ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి రూ. 25వేల నగదు గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలియజేశారు. విద్యార్థులు పి.భవానీ శంకర్, ఆర్.ఫైడిరాజు, ఎస్.కె.అబ్దుల్ రజాక్, టి.ప్రనూష్‌లు తయారు చేసిన యానిమేటెడ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) డ్రోన్‌కు ఈ బహుమతి లభించిందని తెలిపారు.

సెల్‌ఫోన్లు వినియోగించాం

3వ పేజీ తరువాయి

జైలుకు వచ్చాడు. మరో రౌడీషీటర్ యు.రాజేష్ రిమాండ్ ఖైదీ. ఇతడు జూన్ 17 నుంచి కేంద్ర కారాగారంలో ఉంటున్నాడు. ఇటీవల సెల్‌ఫోన్లు కలకలం రేపిన నేపథ్యంలో వీరిద్దరిపై అనుమానం వచ్చిన అధికారులు ప్రశ్నించగా తాము జైలుకు వచ్చిన తరువాత సెల్‌ఫోన్లు వినియోగించిన మాట వాస్తవమేనని అంగీకరించారు. జైలు సిబ్బంది సహకరించారని చెప్పారన్నారు. ఎవరెవరితో మాట్లాడారో తెలుసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆరిలోవ పోలీసులకు తెలిపామన్నారు. వీరిపై భద్రతాపరంగా వస్తున్న అభియోగాలతో గత నెల 31 నుంచి ఇద్దరినీ మరో బ్యారక్‌కు మార్చామన్నారు. ఇక్కడి జైలు నుంచి బదిలీ చేసిన 37 మంది వార్డర్ల స్థానంలో 13 మంది కొత్తవారు వచ్చి చేరారని, మరో 14 మంది కోర్టును ఆశ్రయించారన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో సంక్రాంతి సంబరాలు



భోగి మంట వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ ఆర్.మంజుల

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల సాంస్కృతిక సంఘం గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై భోగి మంటను వెలిగించి సంబరాలు ప్రారంభించారు. ఈ వేడుకలు తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో జరిగే సంక్రాంతి సంబరాలు ప్రకృతితో ప్రతి వ్యక్తికి విడదీయలేని బంధాలను గుర్తు చేయడమే కాకుండా జీవన విధానంలో నూతనోత్సాహాన్ని కలిగించి ముందుకు నడిపిస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వేసిన రంగువల్లులు ఆకట్టుకోగా సంప్రదాయ వస్త్రధారణ ప్రదర్శించిన నృత్య గీతాలు కనువిందు చేశాయి. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, సమన్వయకర్త బి.సంతోషి అనూష, సాంస్కృతిక సమన్వయకర్త బి.రాధమ్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 20 మంది ఎంపిక

శ్రీ చైతన్య విద్యా సంస్థల సహకారంతో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) గురువారం ప్రభుత్వ మహిళా కళాశాలల నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. దీనికి సంబంధించి నిర్వహించిన రాత పరీక్షల్లో 20 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత పొంది ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించేవారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, విద్యార్థినులకు ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చిన శ్రీ చైతన్య విద్యా సంస్థలు, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు అభినందనీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల కో ఆర్డినేటర్ రామారావు, చంద్రశేఖర్, జేకేసీ కో-ఆర్డినేటర్ ప్రజ్ఞ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ-చెర్లపల్లి మధ్య జన సాధారణ్ రైళ్లు

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-చెర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08533 నంబరు గల రైలు ఈ నెల 10, 12, 15, 17 తేదీల్లో ఉదయం 9.45 గంటలకు విశాఖలో బయలుదేరి అదేరోజు రాత్రి 11.30 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08534 నంబరుతో ఈ నెల 11, 13, 16, 18 తేదీల్లో 00.30 గంటలకు (10, 12, 15, 17 తేదీల అర్ధరాత్రి 12.30 గంటలకు) చెర్లపల్లిలో బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు 11 అన్ రిజర్వ్‌డ్ స్లీపర్ క్లాసు, తొమ్మిది జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సిట్టింగ్ కమ్ లగేజి కోచ్‌లతో రాకపోకలు సాగిస్తాయన్నారు. 08537 నంబరుతో మరో రైలు ఈ నెల 10, 11, 15, 16 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08538 నంబరుతో ఈ నెల 11, 12, 16, 17 తేదీల్లో ఉదయం 10 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖ చేరుతుందన్నారు.

11, 12 తేదీల్లో పలు రైళ్లు రద్దు

విజయవాడ పరిధిలో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 11న కాకినాడ-విశాఖ పాసింజర్ (17267), విశాఖ-కాకినాడ పాసింజర్ (17268), విశాఖ-పార్వతీపురం ప్రత్యేక రైలు (08565), పార్వతీపురం-విశాఖ ప్రత్యేక రైలు (08566), గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 12న విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్లీపర్ క్లాసు కోచ్

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భువనేశ్వర్-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు (18447) ఈ నెల 31 వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 1 వరకు తాత్కాలిక అదనపు స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం తెలిపారు.

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించామని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈనెల 19వ తేదీ ఆదివారం కావడంతో 20వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మైనారిటీ విద్యా సంస్థలకు ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు సెలవులు ఉంటాయన్నారు.

ముక్కోటి ఏకాదశికి సింహగిరి ముస్తాబు



వైకుంఠ ఏకాదశి సందర్భంగా మురళీనగర్‌లోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

... 3వ పేజీ తరువాయి

స్వామివారి దర్శనాలు లభించవు. 4 నుంచి 6 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభిస్తాయి. రాత్రి 7 గంటలకు రాత్రి ఆరాధన ఉంటుంది. ఆ సమయంలో భక్తులకు దర్శనాలు నిలుపుదల చేస్తారు. ప్రత్యేక ఉత్సవం కారణంగా ఆలయంలో ఆర్జిత సేవలన్నీ గురువారం రద్దు చేశారు. అనువంశిక ధర్మకర్త, ఆయన కుటుంబ సభ్యులకు మినహా ఇతరులకు అంతరాలయ ప్రవేశం ఉండదు. అన్న ప్రసాద విభాగం ద్వారా భక్తులకు అసంఖ్యాకంగా భోజన వసతి కలిపిస్తున్నారు.

సింహగిరిపై శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి రూ.500 ఉత్సవ ప్రత్యేక దర్శన టికెట్లు ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు లక్ష లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేసినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర రాజగోపురంతోపాటు ఆలయంలో పలు ప్రాంతాలను సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పమాలికలతో అలంకరించారు. ట్రాఫిక్, శాంతి భద్రతలు, నిఘా విభాగం, నేర నియంత్రణ విభాగాలకు చెందిన సుమారు 400 మంది పోలీసులు విధుల్లో ఉంటారు. వారిలో ఏసీపీలు ఇద్దరు, సిఐలు 10 మంది, ఎస్‌ఐలు 20 మంది ఉంటారు. గురువారం సాయంత్రానికే ట్రాఫిక్ పోలీసులు సింహాచలం చేరుకున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

... 3వ పేజీ తరువాయి

ఏసీ స్లీపర్ రూ.3,200 నుంచి రూ.5,800కి పెంచేశారు. బస్సుల కేటగిరీని బట్టి నాన్ ఏసీ స్లీపర్ రూ.2,500 నుంచి రూ.3,200కి పెంచేశారు. వీటితోపాటు విజయవాడ నుంచి తిరుగు ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, 16,17 తేదీల్లో ఏసీ స్లీపర్ టిక్కెట్ రూ.1,500 నుంచి 2,500 మధ్య, ఉంది. నాన్ ఏసీ స్లీపర్ రూ.1,500, అదే నాన్ ఏసీ ఛైర్ అయితే రూ.970 నుంచి రూ.1,100 మధ్య పెంచడం విశేషం. విశాఖ నుంచి ప్రతిరోజూ విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు 54 ట్రావెల్స్ సంస్థలకు చెందిన 110 బస్సులు వెళుతుంటాయి. పండుగ సీజన్‌లో వీటి సంఖ్య కొంతవరకూ పెరుగుతుంది. ఈ లెక్కన సంక్రాంతి సీజన్‌లో వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రతిరోజూ మూడు వేల మంది నగరానికి వస్తారు. వీరంతా పండుగ తర్వాత తిరుగు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. అందరిపైనా టిక్కెట్ పెంపు భారం పడుతుంది. ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలను పెంచేయడం దిగువ, మధ్య తరగతికి చెందినవారికి పెద్దసమస్యగా మారింది. దీనిపై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్కువ వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో రేట్లు...ఆర్టీసీ చార్జీలకు సమానంగా ఉండాలి. అంతకు మించి వసూలుచేస్తే చర్యలు తీసుకుంటాం. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు రేట్లు పెంచుతున్నారనే ప్రచారం నేపథ్యంలో నియంత్రణకు కార్యాచరణ రూపొందించాం. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేస్తున్నాం. అధిక చార్జీలు వసూలుచేస్తే జరిమానాలు విధిస్తాం. ప్రత్యేక బృందాలతో బస్సుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తాం. ఎవరైనా ట్యాక్స్‌లు కట్టకుండా బస్సులను తిప్పుతున్నట్టయితే సీజ్ చేస్తాం.

-ఆదినారాయణ, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్

విమ్స్‌లో హెచ్‌ఎంపీవీ ప్రత్యేక వార్డు

... 3వ పేజీ తరువాయి

కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అయితే ఈ వైరస్‌కు సంబంధించి వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని, ప్రాణాంతకం ఏమీ కాదని ఆయన చెప్పారు. సాధారణ ఫ్లూ వైరస్ లక్షణాలు కనిపిస్తాయన్నారు. జ్వరం, గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ, ఆయాసం వంటివి హెచ్ఎంపీవీ లక్షణాలుగా పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉంది అని ఆయన ఈ తెలిపారు.

వైసీపీలో అయోమయం

... 3వ పేజీ తరువాయి

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు తమ ఆసక్తిని వ్యక్తంచేశారు. కానీ వారి కంటే మరెవరైనా దొరుకుతారేమోననే అధిష్ఠానం వేచి చూస్తున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. మొల్లి అప్పారావు తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ద్వారా అధిష్ఠానంపై ఒత్తిడి చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

భీమిలి వెళ్లడానికి నో చెప్పిన అమర్‌నాథ్

భీమిలి సమన్వయకర్తగా ఇంతవరకూ పని చేసిన మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇటీవల పార్టీకి గుడ్‌బై చెప్పారు. ముత్తంశెట్టి స్థానంలో బాధ్యతలు చేపట్టాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు అధిష్ఠానం సూచించగా, ఆయన నిరాకరించినట్టు ప్రచారం జరుగుతోంది. తనకు పెందుర్తి లేదంటే అనకాపల్లి జిల్లాలోని ఏదైనా నియోజకవర్గం అప్పగించాలని అమర్ కోరినట్టు సమాచారం. దీంతో భీమిలి సమన్వయకర్తగా ఎవరైనా సమర్థుడు పేరు సూచించాలని పార్టీ నేతలను అధిష్ఠానం కోరినట్టు చెబుతున్నారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ చిన్న శ్రీనుతో భీమిలి సమన్వయకర్త బాధ్యతలు చేపట్టడంపై చర్చించగా, తనకు వద్దని అవకాశం ఉంటే ఎస్.కోట లేదంటే ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఏదో ఒకటి అప్పగించాలని స్పష్టం చేసినట్టు నేతలు చెబుతున్నారు. దీంతో సమన్వయకర్తను నియమించేంత వరకూ భీమిలి బాధ్యతలను చూడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌కు సూచించినట్టు తెలిసింది. మరోవైపు గాజువాక సమన్వయకర్త బాధ్యతల పట్ల అమర్‌నాథ్ ఆసక్తి చూపకపోవడంతో ఆయన స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్టు నేతలు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుటుంబసభ్యులు ఆసక్తి చూపుతున్నారని, వారిలో ఒకరికి బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈనెల నుంచి జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టబోతుండడంతో ఆలోగానే సమన్వయకర్తలు లేని చోట కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్టు నేతలు చెబుతున్నారు.

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం.. వీధులు దుర్గంధం

పారిశుధ్య విభాగం సిబ్బంది తీరుపై రామ్‌నగర్, పెదగదిలి వాసుల అసంతృప్తి



జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఉన్న 28వ వార్డులో ఇదీ పరిస్థితి..

నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. వీధుల్లో వేస్తున్న చెత్తను తరలించకపోవడం, కాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఈగలు, దోమల విజృంభిస్తున్నాయి. వీటి దెబ్బకు ఏ రోగాలు సోకుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అపరిశుభ్రత గురించి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రచారం చేయడం, అధికారులు అవగాహన కల్పిస్తుండడం తప్ప ఆచరణలో స్వచ్ఛభారత్ కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో ప్రజల నుంచి కూడా సహకారం అవసరమే. అయితే అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో వీధులు చెత్తాచెదార మయంగా తయారవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రామ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్‌లో ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఈగలు ముసురుతూ కనిపిస్తున్నాయి. దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో అపరిసరాలు దుర్వాసలమయంగా తయారవుతున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది ఈ ప్రాంతం గురించి అసలు పట్టించుకోవడమే లేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. అంతా అపరిశుభ్రత నెలకొనడంతో ఏ వ్యాధులు సోకుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలోని కాలువల్లో నెలల తరబడి చెత్తాచెదారాలు తొలగించకపోవడంతో మురుగు రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రామ్‌నగర్, పితాని దిబ్బ, బానోజీనగర్ తదితర ప్రాంతాల్లో వీధుల్లో చెత్త ఎక్కువగా ఉంటోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై పారిశుధ్య విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, 28వ వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం కూడా ఇదే వార్డులో ఉండడం గమనార్హం. ఇక్కడే ఇలా ఉంటే నగరంలోని వివిధ వార్డుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.



రామ్‌నగర్‌లోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త



పెదగదిలి జంక్షన్‌లో పాలిథిన్ కవర్లను తింటున్న మూగజీవులు

ఆరిలోవలో..

ఆరిలోవ : చెత్త తరలింపులో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పెదగదిలి వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెదగదిలి జంక్షన్‌లో గల ఒక ప్రధాన కాలువ నుంచి పూడిక తీసి గట్టుపై గుట్టలుగా వేశారు. ఈ చెత్తను తరలించపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని, భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇది ప్రధాన మార్గం కావడంతో ముక్కు మూసుకుని తప్పనిసరిగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం నుంచి నగరానికి వెళ్లాల్సి ఉంటుందని, అయినప్పటికీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ చెత్తాచెదారంలో ఆకులు, కాగితాలతో పాటు పాలిథిన్ కవర్లు ఉంటున్నాయి. వీటిని పశువులు తినడంతో అవి అనారోగ్యానికి గురవుతున్నాయని పలువురు చెబుతున్నారు. అలాగే పదో వార్డులోని ఆదర్శనగర్‌లో గల కాలువ వద్ద కూడా పూడికలు తీసి ఆ చెత్తను పక్కనే వదిలేయడంతో పెద్ద సమస్యగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్య విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదంటూ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మోదీ సభ సక్సెస్.. ఉత్తరాంధ్ర ప్రజల విజయం

» జనసేన నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



మద్దిలపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రోడ్డు షో, బహిరంగ సభ సక్సెస్ కావడం ఉత్తరాంధ్ర ప్రజల విజయమని జనసేన నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ పేర్కొన్నారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మోదీ సభకు తరలివచ్చిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, డోలా బాలవీరంజనేయస్వామి, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ శ్రీభరత్, ఉత్తరాంధ్ర కూటమి ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. రథంపై అభివృద్ధి త్రిమూర్తులుగా రోడ్డు షో ప్రారంభించిన మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు ప్రజలు పూల వర్షం కురిపించి బ్రహ్మరథం పట్టారన్నారు. నగర వేదికగా మోదీ సుమారు రూ.209 లక్షల కోట్లు వరాలుజల్లు కురిపించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నాంది పలికారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ రైల్వేజోన్ భవనానికి శంకుస్థాపన చేసి పట్టాలెక్కించారని చెప్పారు. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో కుంటిపడిన రాష్ట్రానికి మోదీ నిధుల మందు పూసి పరుగులు పెట్టించారని కొనియాడారు. కూటమి ప్రభుత్వంపై అసూయతో వైసీపీ నేతలు చేసే విమర్శలను రాష్ట్రాభివృద్ధితో సమాధానం చెబుతామని పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఆదాయపు పన్ను మినహాయింపు



ఏయూ అధికారులకు కృతజ్ఞతలు చెబుతున్న గెస్ట్ లెక్చరర్లు

వెంకోజీపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏయూ అతిథి అధ్యాపకులకు ఆదాయపు పన్ను పరిధి నుంచి మినహాయించి రెన్యురేషన్ ఇవ్వటానికి యూనివర్సిటీ అధికారులు బీసీ రిజిస్టర్, ప్రిన్సిపాల్స్, ఫైనాన్స్ అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులకు అతిథి అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో అతిథి అధ్యాపకులు అందరికి నెలవారీ జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు సురేష్ మీనన్, ప్రసాద్, దేవ, శిరీష్, సురేంద్ర, విక్రం, మృత్యుంజయ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విమ్స్ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న విమ్స్ సిబ్బంది

ఆరిలోవ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విమ్స్‌లో గల బ్లడ్ బ్యాంకు వద్ద గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ రాంబాబు ప్రారంభించారు. సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావన్నారు. పైగా రక్తదానం చేస్తే మరికొందరికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో విమ్స్ సూపరింటెండెంట్ అజాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయానికి వెండి ఆభరణాలు



స్వామివారికి వెండి ఆభరణాలు సమర్పిస్తున్న ఆలయ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన వెండితో పద్మావతి అమ్మవారికి వెండి పాదాలు, చీర, శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు సర్వాంగ కవచాలు గురువారం సమర్పించారు. ఆభరణాలను ఆలయ ధర్మకర్త ప్రసాదరావు, ఆలయ అర్చకులు లక్ష్మణస్వామి, శ్రీనివాస స్వామిలకు భక్తులు అందచేశారు. కార్యక్రమంలో కమిటీ కార్యవర్గ సభ్యులు గౌరీ శంకర్, లక్ష్మీనారాయణ, జగన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నాటి వైకుంఠ ఏకాదశి దర్శనానికి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బీసీ యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోవింద్



కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న గోవింద్

ఎంవీపీ కాలనీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ యూత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగరానికి చెందిన చిటికెల గోవింద్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నారు. బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, ఉత్తరాంధ్ర బీసీ సంఘం నాయకులు శ్యాం సుందర్, రవికుమార్ తదితరులు గోవింద్‌ను అభినందించారు.

'అమర్.. చర్చకు సిద్ధమా?'

సీతంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాధ్ చర్చకు సిద్ధమా? లేదా.. విస్సన్నపేట భూముల్లో ఎంత నొక్కేశారో చర్చకు వస్తే ఇంకా బాగుంటుందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సవాల్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన అయిదేళ్లలో దోచుకోవడం, దాచుకోవడం, ఆక్రమించుకోవడం సిద్ధాంతాలుగా జగన్‌రెడ్డి పాలన సాగిందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు అభివృద్ధి త్రిమూర్తులని, వీరిని ఒకే వేదికపై చూసిన ఉత్తరాంధ్ర ప్రజలకు సంక్రాంతి ముందే వచ్చిందని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పరదాల మాటున తిరిగితే, కూటమి నేతలు ప్రజల మధ్య హుందాగా తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు.

రూ.వందకు 58 ఆవు పేడ పిడకలు

» కేంద్ర కారాగారం వద్ద విక్రయం



అమ్మకానికి సిద్ధం చేసిన ఆవు పేడ పిడకలు

ఆరిలోవ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారం బయల ఉన్న సర్దార్ క్యాంటీన్‌లో ఆవు పేడ పిడకలను విక్రయిస్తున్నారు. సంక్రాంతి రోజులు కావడంతో ఈ ఆవు పేడ పిడకలు బాగా అమ్ముడు పోతున్నాయని క్యాంటీన్ నిర్వాహకులు చెబుతున్నారు. 58 పిడకలను దండగా చేసి రూ.వందకు విక్రయిస్తున్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఎంవీపీ కాలనీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా డీసీపీయూ విభాగంలో కాంట్రాక్టు రక్షణ అధికారి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శిశుగృహలో పార్ట్‌టైమ్ వైద్యులు, ఇతర పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. మిషన్ శక్తి సంబల్ పథకంలో భాగంగా వన్‌స్టాప్ సెంటర్‌లో సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 18లోగా ఎంవీపీ కాలనీలో గల కార్యాలయంలో దరఖాస్తులు అందచేయాలని కోరారు.

లక్ష్య సాధనకు క్రమశిక్షణ అవసరం

» కలెక్టర్ హరేంధిరప్రసాద్



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

సిరిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యారులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలోని విశాఖ వ్యాలీ స్కూలు విశాఖపట్నం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సమయపాలన, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. చదువు ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకోవడంతో పాటుగా సమాజంలో గౌరవ, మర్యాదలు లభిస్తాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను నిరంతరం గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రీ విద్యాలయం ప్రిన్సిపాల్ కమల్‌జీత్, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ దుబే, ఆర్డీవో జి.ఆదినారాయణ, ఎంఎస్ఎస్ అడ్మిన్ హెడ్ డీఎస్ వర్మ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకోవడంతో పాటు వాటిని సాధించేందుకు శ్రమిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ ఈశ్వరీప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాంస్కృతిక నృత్య ప్రదర్శనల్లో విద్యార్థినులు

బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడిగా సుభాష్ చంద్రబోస్



సుభాష్ చంద్రబోస్‌కు నియామక పత్రం అందజేస్తున్న శంకరరావు

వెంకోజీపాలెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో గురువారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర వెనుకబడిన కులాల నాయకుల సామాజిక రాజకీయ చైతన్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రేటర్ విశాఖ నగర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మండెం సుభాష్ చంద్రబోస్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు నియమించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో బీసీ కులాలకు చెందిన వారిని కీలక పదవులు కేటాయించడం ద్వారా బీసీ కులస్థులకు సామాజిక గౌరవాన్ని పెంపొందించిందన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కామన సుబ్బారావు, పల్లా రమణ, శ్రీనివాస్ నాయుడు, బీసీ స్టడీ సర్కిల్ యిళ్ల వెంకటేశ్వరరావు, రాజీవ్ గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

» ప్రధాని మోదీ పర్యటనలో అడ్డుకోవడంపై సీపీఎం నిరసన



మద్దిలపాలెంలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం, జనవరి 9 ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేవని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్కెఎస్వీ కుమార్ అన్నారు. మోదీ సభ నేపథ్యంలో వామపక్ష పార్టీల నాయకులను అరెస్టులు చేయడానికి నిరసనగా గురువారం మద్దిలపాలెంలో సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని నిరసనలు చేపడితే అక్రమ అరెస్టు చేయడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోదీ నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భజన చేశారే తప్ప స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని ఒత్తిడి తేలేదన్నారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయని స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అడగడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు, పవన్‌లు స్టీల్‌ప్లాంట్‌పై యూటర్న్ తీసుకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణారావు, వెంకటరావు, కె.కుమారి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉత్తరాంధ్ర బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నరవ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు, రాజశేఖర్

సీతంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోనల్ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనంద దాయకమని, దీంతో పాటు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, సెల్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్స్ కూడా సౌత్ కోస్ట్ రైల్వే హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధికి దోహదపడాలని ఉత్తరాంధ్ర బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నరవ రాంబాబు, సౌత్‌కోస్ట్ రైల్వే ఓబీసీ సంఘాల అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్డి రాజశేఖర్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మధురానగర్ లలితానగర్‌లో గల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వేలాదిమంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక ఏళ్ల తరబడి మగ్గిపోతున్నారని, ఈ తరుణంలో సౌత్ కోస్ట్ రైల్వే కార్యకలాపాలు ప్రారంభంతో నిరుద్యోగులకు ఊపిరి పోసినట్టుగా ఉందన్నారు. వేలాది బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులు తగదు

ఆరిలోవ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు అమలు చేయాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే జిల్లాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అయితే కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించనున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ సెలవులలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఇది ముమ్మాటికీ బాలల హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. అలా చేస్తే చర్యలు తప్పవన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై టీడీపీ నేతలు ప్రచారం



28వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కనకరాజు, సురేశ్, సచివాలయం సిబ్బంది

రామ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ 28వ వార్డులో టీడీపీ నేతలు గురువారం అవగాహన కల్పించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు దుకాణాల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు వినియోగించటం కారణంగా కాలుష్యం ఎక్కువ అవుతుందన్నారు. అలాగే అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. అయితే ప్లాస్టిక్ నిషేధానికి ప్రజాసహకారం తప్పనిసరి అన్నారు. పాలిథిన్ కవర్లు కాకుండా గుడ్డ సంచులను దుకాణాలకు వెళ్లేటపుడు తీసుకెళ్లాలని సూచించారు. అలాగే దీనిపై ఎవరికి వారుగా ప్రచారం, అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైడిరాజు పోలుపల్లి సురేష్, ఎస్.రాంబాబు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● గేమ్ ఛేంజర్ : మెలోడి, సంగం, శరత్, జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, శ్రీరామ, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), నరసింహ, శ్రీనరసింహ, సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ, తాతా, గణేష్, సప్తగిరి (తగరపువలస), నటరాజ్-1,2 (పెందుర్తి)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 20, క్యారెట్ 42 దొండకాయలు 50, బంగాళ దుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 48, బరబాటి 46, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడ దుంపలు 40, కంద 66, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 40, బ్రకోలి 100 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

నోరూరించే బేంబూ బిర్యానీ

- మన్యంలో ఫేమస్
- ఇష్టంగా ఆరగిస్తున్న పర్యాటకులు
- ఉపాధి పొందుతున్న నిరుద్యోగ గిరిజనులు
- ఇద్దరికి సరిపడా బిర్యానీ రూ.600

(అనంతగిరి- ఆంధ్రజ్యోతి)

మన్యంలో వండే ప్రతి వంటకానికి ఓ ప్రత్యేక ఉంటుంది. గిరిజనుల ఆహారపు అలవాట్లను మైదాన ప్రాంతాల వాసులు ఇష్టపడుతుంటారు. ఏజెన్సీ ప్రాంతంలో బేంబూ చికెన్ ఎంత ఫేమస్ అయిందో అందరికీ తెలిసిందే. ఇదే తరహాలో ఇప్పుడు బేంబూ బిర్యానీ కూడా అంతే ప్రాచుర్యం పొందింది. మన్యానికి వచ్చే పర్యాటకులు తప్పనిసరిగా బేంబూ బిర్యానీ తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. బేంబూ బిర్యానీ తయారు చేసే విధానం విభిన్నంగా ఉండడం, అది రుచికరంగా ఉండడంతో పర్యాటకులు బాగా ఇష్టపడుతున్నారు.



అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను తిలకించేందుకు పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశీ పర్యాటకులు సైతం అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ గిరిజన యువత తయారు చేసే బేంబూ చికెన్‌ను ఎంతో ఇష్టంగా తినేవారు.

దీంతో పర్యాటకుల అభిరుచికి తగ్గట్టుగా బేంబూ బిర్యానీని తయారు చేయడం మొదలు పెట్టారు. అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, చింతపల్లి, తదితర పర్యాటక ప్రాంతాల్లో బేంబూ బిర్యానీ తయారు చేసేవారి సంఖ్య పెరిగింది. ప్రతి పర్యాటక కేంద్రంలో బేంబూ బిర్యానీ తయారు చేసే దుకాణాలు 5 నుంచి 10 వరకు ఉన్నాయి. దీని వల్ల స్థానిక గిరిజన యువతకు కొంత మేర ఉపాధి దొరుకుతోంది.



వెదురుబొంగులో వేసేందుకు బాస్మతి రైస్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం



ఉడికిన తరువాత గిన్నెలోకి బిర్యానీ తీస్తున్న దృశ్యం



పర్యాటకులు ఇష్టంగా ఆరగిస్తున్న బేంబూ బిర్యానీ



వెదురుబొంగులో ముందుగా చికెన్ వేస్తున్న దృశ్యం

తయారు చేసే విధానం

300 గ్రామాల బాస్మతి బియ్యాన్ని తీసుకుని బాగా కడిగి, అరగంట పాటు నానబెట్టాలి. నీటిని పారబోసిన తరువాత దాల్చిన చెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, బిర్యానీ ఆకును బియ్యంలో కలపాలి. తరువాత రెండు చికెన్ లెగ్ పీసులు, రెండు చెస్ట్ పీసులను తీసుకుని అల్లం, వెల్లుల్లి పేస్ట్, దనియాల పొడి, కారం, పసుపు, ఉప్పు, చికెన్ మసాలా, ఆయిల్ వేసి ముద్దలాగా తయారుచేసి చికెన్‌కు దట్టంగా రాయాలి. వెదురు బొంగులో ముందుగా రెండు చికెన్ ముక్కలను పెట్టి గ్లాసు బిరియాని రైస్‌ను వేసి, గ్లాసు నీరుపోసి, ఇంకో చికెన్ ముక్కను పెట్టాలి. అలాగే గ్లాసు బియ్యం వేసి, గ్లాసు నీరు పోసిన తరువాత కొత్తిమీర వేసి అడ్డాకులతో మూత గట్టిగా పెట్టి, అరగంటపాటు వెదురుబొంగును కాల్చాలి. బాగా ఉడికిన తరువాత తీయాలి. అంతే బేంబూ బిర్యానీ రెడీ అవుతుంది.

వెదురు బొంగులకు డిమాండ్

బేంబూ బిర్యానీ ఫేమస్ కావడంతో పర్యాటక ప్రాంతాల్లో వెదురు బొంగులను కూడా సైజ్‌ను బట్టి ఒక్కొక్కటి రూ.150 నుంచి రూ.300 వరకు ధర పలుకుతోంది.

బేంబూ బిర్యానీ తయారుచేసే దుకాణాదారులు వివిధ ప్రాంతాల్లో బొంగులను కొనుగోలు చేస్తున్నారు. అందుకే ఇద్దరికి సరిపడా బిరియానిని రూ.600కు విక్రయిస్తున్నారు.

పెదగంట్యాడ తహసీల్దారుపై కోర్టు ధిక్కరణ కేసు

పెదగంట్యాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ తహసీల్దారుపై కోర్టు ధిక్కరణ కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సర్వే నంబరు 274 అశోక్‌నగర్‌లో రేకుల షెడ్డు వేసుకుని కొన్నేళ్లుగా నివసిస్తున్నానని, షెడ్డు తొలగించకుండా చూడాలని సిరికి లక్ష్మి హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిని పరిశీలించిన హైకోర్టు గత ఏడాది జూన్ 18న స్టేటస్‌కో ఉత్తర్వులు జారీచేసింది. అయినప్పటికీ తహసీల్దార్ రాజకీయనాయకుల సిఫారసులకు తలొగ్గి హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి రేకుల షెడ్డును కూల్చివేశారని లక్ష్మి గత ఏడాది చివరలో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. దీనిపై స్పందించిన హైకోర్టు తహసీల్దారుపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి, కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. కాగా హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి రేకుల షెడ్డును కూల్చివేయించిన తహసీల్దార్‌పై తగిన చర్యలు చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి కన్వీనర్ కె.కృష్ణకుమార్ ఒక ప్రకటనలో కోరారు.

విశాఖవాసుల మృతి బాధాకరం: ఇన్‌చార్జి మంత్రి

మహారాణిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటనలో విశాఖపట్నం వాసులు మృతి చెందడం బాధాకరమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి ఒక ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నామన్నారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

తిరుపతి సంఘటన దురదృష్టకరం: వీఎంఆర్‌డీఏ చైర్మన్

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సంఘటన దురదృష్టకరమని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ భక్తులకు టీటీడీ దర్శనం టికెట్లు జారీ చేసే ఈ -దర్శన్ కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం మూసివేసిందని, అవి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. దీనిని రాజకీయం చేయడం సరికాదని, టీటీడీని భ్రష్టు పట్టించిన ఘనత వైసీపీదేనన్నారు. ప్రస్తుతం టీటీడీని ప్రక్షాళన చేసేపనిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. సంఘటన జరిగిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి తక్షణసహాయక చర్యలు ప్రారంభించారన్నారు. పలువురు మంత్రులు హుటాహుటిన తిరుపతి వెళ్లారని, ఇక ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వైసీపీ నాయకులు శవరాజకీయాలు మానుకోవాలని, అక్కడ వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా యాగీ చేయడం సరికాదని పేర్కొన్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పరదాలు కట్టుకుని రాజప్రాసాదంలో దాక్కొన్న వారా మాట్లాడేదని విమర్శించారు.

18న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్టు సీఈవో పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన 18న ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఒకటి నుంచి ఏడు సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

రేపటి నుంచి వందేభారత్‌కు అదనంగా నాలుగు కోచ్‌లు

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 11 నుంచి అదనంగా మరో నాలుగు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రస్తుతం 16 కోచ్‌లతో నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లు జోడిస్తున్నామన్నారు.

12న ఘంటసాల పాటల పోటీలు

సిరిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న ఘంటసాల పాటల పోటీలను నిర్వహించనున్నట్టు చిత్ర నిర్మాత సీహెచ్ రామారావు తెలిపారు. పౌరగ్రంథాలయంలోఆదివారం ఉదయం 9 గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామన్నారు. పురుషులలో జూనియర్స్ 16 ఏళ్లలోపు, సీనియర్స్ పదహారేళ్లు దాటి రెండు విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ఘంటసాల ది గ్రేట్ సినిమా ఫిబ్రవరిలో విడుదల కానున్న నేపథ్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని ఏక కంఠగీతాలు ట్రాక్ లేకుండా పాడాలన్నారు. మహిళలు యుగళగీతాలు లేదా ఘంటసాల సంగీతంలో పాటలు ట్రాక్ లేకుండా పాడాలన్నారు. విజేతలు విజయవాడలో జరిగే తుది పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. వివరాలకు 83415 32799, 72075 32799 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

» వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందినవారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున, గాయపడినవారికి రూ.20 లక్షలు చొప్పున పరిహారం అందజేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతిలో ఏడుగురు మృతి కారణమైన ఘటన దురదృష్టకరమన్నారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో టీటీడీ విఫలమైందని, ఈ మరణాలు ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. టీటీడీ చరిత్రలో ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. టీటీడీని కూటమి ప్రభుత్వం రాజకీయాలకు వాడుకుంటోందని, గతంలో లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి అభాసుపాలయ్యారన్నారు. సనాతన ధర్మం కోసం మాట్లాడే పవన్ కల్యాణ్ ఈ మరణాల గురించి ఏం చెబుతారని ప్రశ్నించారు. దీనికి ఎలాంటి దీక్ష చేస్తారో చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడునెలల్లో ఒక్కప్రాజెక్టుని కూడా తేలేదని, వైసీపీ హయాంలో వచ్చిన ప్రాజెక్టులను ప్రధానితో ప్రారంభించారన్నారు. ప్రధాని మోదీని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రశ్నించలేదన్నారు. పార్టీ నేతలు మొల్లి అప్పారావు, కెల్ల సునీత పాల్గొన్నారు.

వైసీపీ నాయకులవి పసలేని వ్యాఖ్యలు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులన్నీ వైసీపీ హయాంలో వచ్చినవేనని ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యల్లో పసలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. ఉపాధ్యక్షుడు గొంప సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావుతో కలిసి గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో మంజూరైన ప్రాజెక్టులకు అధికారంలో ఉండగా ఎందుకు శంకుస్థాపన చేయలేదని ప్రశ్నించారు. మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ తన హయాంలో జిల్లాకు ఏమి సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే స్థాయి అమర్‌కు లేదన్నారు. మైక్ దొరికిందని మాట్లాడితే జనం చూస్తూ ఊరుకోరన్నారు. ఎన్నికల్లో దారుణ పరాజయం ఎదురైనా పంథా మార్చుకోకపోతే రాజకీయంగా అమర్ కనుమరుగవుతాడని వ్యాఖ్యానించారు. రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణాని ఐదేళ్లుగా భూమి కేటాయించలేదని, అప్పుడు అమర్ ఏం చేశారని నిలదీశారు. తిరుపతి ఘటనలో ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. వీరిలో నలుగురు ఉమ్మడి జిల్లాకు చెందిన వారని, వారి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉక్కు పరిశ్రమపై మాట్లాడకపోవడం దారుణం

» ప్రధాని, కూటమి నేతల తీరుపై వామపక్ష నేతల మండిపాటు

జగదాంబ కూడలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ, పరిరక్షణపై మాట్లాడని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం జగదాంబ కూడలిలో వామపక్షాల నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ ప్రసంగంలో ఉక్కు పరిశ్రమకు చోటుకల్పించకపోవడంపై మండిపడ్డారు. ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఎన్నికల ముందు హామీలిచ్చిన కూటమి నేతలు మోదీ జపం చేయడాన్ని తప్పుబట్టారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ బి.రంగారావు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను పక్కన పెట్టి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మోదీ, చంద్రబాబు, పవన్‌లు వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. పరిశ్రమ పరిరక్షణకు పోరాటానికి సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో జగన్, అచ్యుతరావు, రాంబాబు, నాగరాజు, పద్మ, బేగం, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ, కూటమి నేతలకు వ్యతిరేకంగా జగదాంబ కూడలిలో నిరసన తెలుపుతూ నినాదాలు చేస్తున్న వామపక్షాల నాయకులు


నేటి నుంచి అప్పన్న ఆలయంలో ధారోత్సవాలు



సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన గంగధార మండపం

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి ధారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 14 వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి, సువర్ణ తయారు, చతుర్భుజి అమ్మవార్లు, గోవింద రాజస్వామి, అమ్మ వార్లు, ఆళ్వార్లను గంగధారకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఆఖరి రోజు అందరి దేవతామూర్తులకు గంగధార వద్ద స్నపన నిర్వహించడంతో ఉత్సవాలు పూర్తి కానున్నాయి.

సింహగిరిపై గంగధారను ఒడిసి పట్టేలా చర్యలు



వాటర్ పంపింగ్ చేసే షెడ్డు



నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన పంప్‌సెట్

సింహాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై ఏళ్ల తరబడి నిర్విరామంగా జాలువారుతున్న పవిత్ర గంగధార వృథా నీటిని ఒడిసి పట్టేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు దేవస్థానం నిధులు రూ.4 లక్షలు వెచ్చించి గంగధార సమీపంలో కేశఖండన శాలకు సమీపాన ప్రత్యేక ట్యాంకు నిర్మించారు. అందులోకి గంగధార నుంచి వచ్చే వృథా నీటిని సేకరించి ఆ నీటిని భక్తుల తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. అలాగే విజయవాడకు చెందిన భవానీ టెక్నాలజీ సర్వీసెస్ నిపుణులతో హైవాటర్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌ను అమలు చేయడానికి నిర్ణయించి, ఇప్పటికే ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నీటి నిల్వలను నియంత్రిస్తూ వృథాను అరికట్టేందుకు వీలవుతుంది. నూతనంగా నిర్మించిన ట్యాంక్‌ను ఆలయ ఈఓ వేంద్ర త్రినాథ రావు శుక్రవారం ప్రారంభించనున్నారు.